

27 ఏళ్ల కిందట శిరోముండనానికి గురైన బాధితులు (ఫైల్)

కోర్టు తీర్పుతో దళితులకు న్యాయం



శిరోముండనం కేసులో నిందితులకు 18 నెలల జైలు శిక్ష విధించడంతో కోర్టుపై చాలా నమ్మకం కలిగింది. ఈ కేసులో న్యాయం కోసం 28 ఏళ్లుగా ఎదురు చూశాం. కోర్టు తీర్పుతో దళితులకు న్యాయం జరిగింది. - **కనికెళ్ల గణపతి, బాధితుడు**

27 ఏళ్లు కోర్టుల చుట్టూ తిరిగాం




27 ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగాం. ముద్దాయిలకు ఎట్టకేలకు శిక్ష ఖరారు చేయడంతో సంతోషంగా ఉన్నా. మిగిలిన బాధితులు, నాయకులతో కలిసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటాం.- **చల్లపూడి పట్టాభి, బాధితుడు**

కేసు నిలిపిన ఘనత బొజ్జా తారకానిదే



పుట్టుస్వామి కమిషన్ నివేదికతో అప్పటి ప్రభుత్వం శిరోముండనం కేసు ఎత్తివేసింది. హైకోర్టు న్యాయవాది బొజ్జా తారకం మాండమస్ రిట్ వేసి కేసు విచారణ పునఃప్రారంభించేలా చేశారు. **-వి.భీమశంకరం, దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్**

వివాదాల తోటలో..
ధర్మమే గెలిచింది!



తోట త్రిమూర్తులు, మండపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

శిరోముండనం కేసులో 27 ఏళ్ల తర్వాత కోర్టు తీర్పు

- మండపేట వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు సహా 9 మందికి శిక్ష
- 18 నెలలు తక్కువ శిక్షపై ఆవేదన
- మళ్లీ పోరాడతామంటున్న బాధితులు
- వెంకటాయపాలెంలో హర్షం
- మూడేళ్ల కిందట వైసీపీ ఎంపీ బోస్ ఫిర్యాదు
- నాడు చర్చనీయాంశమైన అంశం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకటికాదు రెండు కాదు.. ఏకంగా 27 ఏళ్ల పైమాటే.. న్యాయం కోసం తిరగని కోర్టు లేదు.. ఎట్టకేలకు సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. శిరోముండనం నిందితులకు శిక్ష ఖాయమైంది. కానీ తీర్పు వచ్చిన ఆనందంకంటే తమకు అసలైన న్యాయం జరుగుతుందని ఇన్నేళ్లూ నిరీక్షించిన క్షణాలకు విలువ లేకుండా పోయిందని ఆ బాధితులు వాపోతున్నారు. న్యాయం కోసం 27 ఏళ్లు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూసి మానసిక క్షోభతో శిక్ష అనుభవిస్తే నిందితులకు కేవలం 18 నెలలే జైలుశిక్ష పడడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తగిన న్యాయం కోసం మళ్లీ పోరాటం చేస్తామని చెప్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శిరోముండనం కేసు తీర్పు జిల్లాలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కేసులో తీర్పు రావడానికి ఇన్నేళ్ల నిరీక్షణకు కారణాలేమిటనే చర్చ జరుగుతోంది.

అప్పట్లో పెను సంచలనమై..

రామచంద్రపురం నియోజకవర్గానికి 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తోట త్రిమూర్తులు ఎమ్మెల్యేగా నెగ్గారు. ఆ ఎన్నికల్లో అదే మండలం వెంకటాయపాలేనికి చెందిన ఐదుగురు దళిత యువకులు, త్రిమూర్తులు మధ్య రాజకీయ విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో ఐదుగురు దళిత యువకులను చిత్రహింసలకు గురిచేసి ఇద్దరికి శిరోముండనం చేయించారు. ఒక ఎమ్మెల్యే ఇలా దళితులను అవమానించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. దీంతో అప్పట్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదిత్య త్రిపాఠి నేరుగా వెంకటాయపాలెం వెళ్లి విచారణ చేపట్టి 1997 జనవరి 4న ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నెం.1/1997 కింద ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మొత్తం 10 మందిని నిందితులుగా గుర్తించగా.. నాడు ఎమ్మెల్యేగా ఉన్న తోట త్రిమూర్తులును ఎ1గా నిర్ధారించారు. జనవరి 7న త్రిమూర్తులును పోలీసులు అరెస్టు చేశారు. జనవరి 18న కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేయగా న్యాయస్థానం ఆదేశాల మేరకు 87 రోజుల పాటు త్రిమూర్తులుతో పాటు మరికొందరు సహా నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత వీరు బెయిల్‌పై విడుదలయ్యారు. 1997 అక్టోబరు 15న కేసును రాజమండ్రి నుంచి విశాఖలోని ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేశారు. పుట్టుస్వామి కమిషన్ రంగంలోకి దిగి 1998లో కేసు విచారణ చేపట్టింది. కమిషన్ నివేదిక ఆధారంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేసును ఉపహరించుకుంటూ జీవో జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు ఆందోళనలకు దిగాయి. అప్పట్లో న్యాయవాది బొజ్జా తారకం తదితరులు హైకోర్టును ఆశ్రయించగా కేసు మళ్లీ విచారణ మొదలైంది. నిందితులు 2006లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బాధితులు దళితులు కాదని, బీసీ వర్గం కిందకు వస్తారంటూ ఫిర్యాదులు వచ్చాయి. అయితే ఇవేవీ న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఈ కేసులో 2020లో వైసీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి. శిరోముండనం కేసుపై 2020 నవంబరులో ఎంపీ బోస్ రాష్ట్ర హోంమంత్రికి లేఖ రాయడం కలకలం రేపింది. ఎన్నో ఏళ్ల కిందట జరిగిన శిరోముండనం కేసులో విచారణను వేగవంతం చేయాలని ఆ లేఖలో అప్పట్లో బోస్ డిమాండ్ చేశారు. దళితులకు అన్యాయం చేసిన నేపథ్యంలో సొంత పార్టీ అయినా సరే త్రిమూర్తులును వదిలిపెట్టేది లేదని అప్పట్లో పేర్కొన్నారు. తాజా తీర్పు పైనా బోస్ స్పందించారు. పూర్తి తీర్పు చదివిన తర్వాత ఏం చేయాలో నిర్ణయిస్తానన్నారు.

జగన్ పాలనలో దళితులకు రక్షణేది..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దళితులకు రక్షణ లేకుండా పోయింది. ఒక పక్క నా ఎస్సీలు అంటూనే జగన్ ప్రభుత్వం దళితులను నిలువునా మోసం చేసి రోడ్డున పడేస్తే.. ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ వారిపై దాడులు, హత్యలకు తెగబడ్డారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలే కాకినాడలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య ఘటన. 2022 మే 18న తన వద్ద పనిచేస్తున్న కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అర్ధరాత్రి కాకినాడ బీచ్ రోడ్డులో హత్య చేసి మరునాడు మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకువచ్చాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరంలో వరప్రసాద్ అనే దళిత యువకుడికి పోలీస్ స్టేషన్‌లోనే కొందరు వైసీపీ నేతలు శిరోముండనం చేశారు. 2022 జనవరిలో కాకినాడ జిల్లా సామర్లకోటలో పోలీసుల వేధింపులు తాళలేక దళిత యువకుడు గిరీష్‌బాబు ఆత్మహత్య చేసుకున్నాడు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో జాతరలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో దళిత యువకుడు రాము మృతి చెందాడు. కోడికత్తి కేసులో దళిత యువకుడు శ్రీను జైలుపాలయ్యాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలోని మలకపల్లిలో దళిత యువకుడి హత్య, దొమ్మేరులో వైసీపీ నేతల ఒత్తిడితో దళిత యువకుడి ఆత్మహత్య జరిగాయి. ఇలా అనేక మంది దళిత యువకులు అధికార పార్టీ అరాచకాలకు బలయ్యారు.

ఇన్నేళ్లలో 10 మందికిపైగానే మృతి...

27 ఏళ్ల పాటు సుదీర్ఘంగా కొనసాగిన కేసులో బాధితులు, సాక్షుల్లో అనేక మంది చనిపోయారు. కేసులో మొత్తం 24 మంది సాక్షులుగా ఉండగా వీరిలో 10 మంది చనిపోయారు. బాధితుల్లో ఒకరు, ముద్దాయిల్లో ఒకరు చనిపోయారు. అయితే 2019 నాటికి ఈ కేసు 146సార్లు వాయిదా పడింది. 27 ఏళ్లు దాటినా తీర్పు రాకపోవడంతో బాధితుల్లో నిరాశ ఆవహించింది. అయినా పట్టు వదల్లేదు. ఎట్టకేలకు తీర్పు వచ్చినా నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రస్తుత మండపేట వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుకు విధించిన శిక్ష చాలా చిన్నదని బాధితులు వాపోయారు. 27 ఏళ్ల పాటు తీర్పు ఇవ్వకుండా నిందితుడికి 18 నెలల జైలుశిక్ష విధించిందని మంగళవారం రామచంద్రపురంలో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

దళిత వ్యతిరేకులకు సీట్లా?

ముప్పాళ్ల సుబ్బారావు, న్యాయవాది



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దళితులకు శిరోముండనం చేసిన తోట త్రిమూర్తులుకు మండపేట నుంచి అధికార వైసీపీ సీటు ఖరారు చేసిందని.. కోర్టు తీర్పు నేపథ్యంలో దళిత వ్యతిరేకులను వైసీపీ పోటీకి నిలుపుతుందా? లేక అభ్యర్థిని మారుస్తుందా? అని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు ప్రశ్నించారు. దళితులకు అనుకూలమని చెప్పుకునే జగన్ తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



శిక్ష సరిపోదు.. పోరాడతాం!
దళిత ఐక్య వేదిక సంఘం నాయకులు

శిరోముండనం కేసులో తీర్పుపై హైకోర్టులో పోరాటం చేస్తామని దళిత ఐక్య వేదిక ప్రకటించింది. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు వీరేశగుళ్ల కాలనీలోని గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 27 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న బాధితులు, దళితులకు కోర్టు తీర్పు నిరాశ కలిగించిందన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ, మండపేట వైసీపీ అభ్యర్థిగా ఉన్న తోట త్రిమూర్తులును కోర్టు దోషిగా ప్రకటించిందని.. జగన్ ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వానికి దగాపడ్డ దళితులే తీర్పు చెబుతారన్నారు. నిందితులకు 18 నెలల జైలు, జరిమానా విధించడం.... .వెంటనే బెయిల్ మంజూరు చేయడం చూస్తుంటే బాధితులకు నష్టం కలిగినట్టు ఉందన్నారు. తదుపరి కార్యాచరణ నిర్దేశించుకుని న్యాయపరమైన ప్రక్రియలో ముందుకు సాగుతామని తెలిపారు. సమావేశంలో దళిత ఐక్య వేదిక సహ కన్వీనర్ చీకట్ల వెంకటేశ్వరరావు, శిరోముండనం బాధితుడు కోటి చినరాజు, దళిత ఐక్య వేదిక నాయకులు గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, రేవు నాగేశ్వరరావు, బి.సిద్ధు, అంబటి కృష్ణ, సాదే రాజేష్, మేడిశెట్టి ఇజ్రాయిల్, చిన్న పాల్గొన్నారు.

తోట త్రిమూర్తులును ఎన్నికలకు దూరంగా ఉంచాలి

దళితుల పట్ల ఎవరు అమానుషంగా ప్రవర్తించినా శిక్ష తప్పదని న్యాయస్థానాలు మరొకసారి రుజువు చేశాయి. దళితుల శిరోముండనం ఘటనలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు ఎట్టకేలకు శిక్షపడడం హర్షణీయం. దళితుల ఓట్లతో మరొకసారి గద్దెనెక్కేందు కు జగన్ కపట ప్రేమ కురిపిస్తున్నాడు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి సిగ్గు తెచ్చుకుని తోట త్రిమూర్తులు ఎమ్మెల్సీ పదవిని రద్దు చేసి ఎన్నికలకు దూరంగా ఉంచాలి. దళితుల ఆత్మగౌరవాన్ని పెంచేది తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమే. **- కాశీ నవీన్ కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి**

పోరాడి మరణించిన అమరుల ఆత్మకు శాంతి

రామచంద్రపురంలో జరిగిన దళితులు శిరోముండనం ఘటనపై రెండు దశాబ్దాలకు పైబడి ఎందరో దళిత నాయకులు పోరాడారు. వారిలో చాలా మంది మరణించారు. శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులుకు జైలు శిక్షపడడంతో దళిత నాయకుల ఆత్మకు శాంతి కలుగుతుంది. 28 ఏళ్ళ తర్వాత తోట త్రిమూర్తులుకు జైలు శిక్షపడడంతో న్యాయస్థానాలపై నమ్మకం మరింతగా పెరిగింది. ఇటు వంటి వ్యక్తులను రాజకీయ పార్టీలు ప్రోత్సహించకూడదు. **- పట్నాల విజయకుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు**

27 ఏళ్ల తర్వాత దళిత యువతకు న్యాయం జరిగింది..

దళిత యువకులకు శిరోముండనం చేసిన వైసీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుతో పాటు మరికొందరికి న్యాయస్థానం 18 నెలల జైలు, రూ.2 లక్షలు జరిమానా విధించడం వైసీపీకి చెంపపెట్టు.. 1996 సంవత్సరం కేసులో దళిత యువకులకు న్యాయం జరిగింది. గడిచిన ఐదేళ్లలో దళిత, ముస్లిం, మైనార్టీలపై దాడులు చేసి హత్యలకు తెగబడ్డ ప్రతి ఒక్కరిని రానున్న టీడీపీ ప్రభుత్వంలో చట్టం ముందు నిలబెడతాం. **- మద్దిపాటి వెంకటరాజు, గోపాలపురం టీడీపీ అభ్యర్థి**



వీరవరంలో రామాలయం

రామడికి కుడివైపున సీతమ్మ

నేడు రాములోరి కల్యాణం

కడియం, ఏప్రిల్ 16 : ప్రతి ఇంటికి రాముడితో సంబంధం ఉంటుంది. ఎందుకంటే హిందువులకు రాముడు అంటే ఒక అటాచ్‌మెంట్.. ఒక నమ్మకం.. అందుకే రాముడి ఆలయంలేని ఊరుండదు..ఏదో ఒక చోట రాముడిని పెట్టుకుని కొలుచుకుంటారు.. ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా కల్యాణం జరుపుకుంటారు..ఆ ఘడియకు వేళయింది.. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామ నవమి వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి.. జిల్లాలోనూ చరిత్ర కలిగిన రామాలయాలు ఉన్నాయి. అటువంటి ఆలయాల్లో కడియం మండలం వీరవరం కోదండ రాముడి ఆలయం ఒకటి. ఈ ఆలయానికి ఒక విశిష్టత ఉంది. ఎన్నో ఏళ్ళ కిందట సీతారాములను నారదముని ప్రతిష్ఠించారని కథ.. ఈ ఆలయంలో మరో ప్రత్యేకత ఏమిటంటే రామయ్యకు సీతమ్మ అమ్మవారు కుడివైపు ఉండడం. వందల ఏళ్ళ కిందట నిర్మించిన ఈ ఆలయంలో ప్రతి ఏటా శ్రీరామ నవమి రోజు వైఖానస ఆగమ సిద్ధాంతం ప్రకారం స్వామి వారి కల్యాణం, వేలాది మందికి అన్నసమారాధన, సాయంత్రం స్వామివారి రథోత్సవం చేస్తారు.ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక నామినేషన్ల పర్వం

- 18 నుంచే దరఖాస్తుల స్వీకరణ
- అభ్యర్థులకు ముహూర్తం ఖరారు
- 22లోపే కూటమి అభ్యర్థుల దాఖలు
- కొందరు వైసీపీ అభ్యర్థులు కూడా
- నియోజకవర్గాల్లో భారీగా ఏర్పాట్లు
- ర్యాలీగా వెళ్లి నామినేషన్లు
- ఎన్నికల వేళ..మరో అడుగు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు మరో అడుగు పడనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది.. ఇప్పటి వరకూ అభ్యర్థుల ఎంపికపై పార్టీలు కుస్తీ పట్టాయి. ఎన్నడూ లేనిది ఈ సారి వడపోత బాగా సాగింది. ఎవరికి టిక్కెట్ వస్తుందోననే టెన్షన్ బాగా నడిచింది. చివరి వరకూ పార్టీలు ఆచితూచి అడుగులు వేశాయి. అభ్యర్థులు అన్ని దశలూ దాటుకుని వచ్చారు. ప్రస్తుతం ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల ఘట్టానికి మరో అడుగు దూరంలో ఉన్నారు. అభ్యర్థుల నామినేషన్లు దాఖలు చేయడానికి సమయం ఆసన్నమైంది. ఈ నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుంది. అదే రోజు ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. కె.మాధవీలత తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో వివిధ పార్టీల తరపున పోటీ చేయనున్న అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. అందులో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ముందుండడం గమనార్హం. వైసీపీ , కాంగ్రెస్ అభ్యర్థులు కొందరు ముహూర్తం ఖరారు చేసుకోగా, వైసీపీ అభ్యర్థులు ఇంకా ముహూర్తం ఖరారు చేసుకోలేదు. కూటమి అభ్యర్థులు మాత్రం ఈ నెల 18,19,22వ తేదీల్లోనే నామినేషన్లు దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తొలి రోజు 18న రాజమహేంద్రవరం సిటీ కూటమి అభ్యర్థి (టీడీపీ) ఆదిరెడ్డి వాసు, గోపాలపురం కూటమి అభ్యర్థి (టీడీపీ) మద్దిపాటి వెంకట్రాజు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఆదిరెడ్డి ఉదయం 11గంటలలోపు నామినేషన్లు దాఖలు చేయడానికి రూట్ సిద్ధం చేసుకున్నారు. మద్దిపాటి వెంకట్రాజు ఘంటావారిగూడెం నుంచి ర్యాలీగా గోపాలపురం వెళ్లి అక్కడ తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. 19న కూటమి లోక్‌సభ అభ్యర్థి(బీజేపీ) దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం రూరల్ కూటమి అభ్యర్థి (టీడీపీ) గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు కూటమి అభ్యర్థి (జనసేన) కందుల దుర్గేష్, కొవ్వూరు కూటమి అభ్యర్థి (టీడీపీ) ముప్పిడి వెంకటేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అనపర్తి నుంచి టీడీపీ అభ్యర్థి పేరు ఖరారు ఎందుకో ఆలస్యం అవుతోంది. కానీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూడా 19న నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇక రాజానగరం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ 22వ తేదీన నామినేషను దాఖలు చేయడానికి ముహూర్తం పెట్టుకున్నారు. కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి గిడుగు రుద్రరాజు 22న ముహూర్తం పెట్టుకున్నారు. ఆదే రోజు సిటీ కాంగ్రెస్ అభ్యర్థి బోడా వెంకట్ కూడా నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. ఇక వైసీపీకి చెందిన కొవ్వూరు అభ్యర్థి తలారి వెంకట్రావు 18న, రాజానగరం అభ్యర్థి జక్కంపూడి రాజా, గోపాలపురం అభ్యర్థి తానేటి వనిత 19న , రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి చెల్లుబోయినవేణు 22న ముహూర్తం పెట్టుకున్నట్టు సమాచారం.ఇంకా కొంతమంది వైసీపీ అభ్యర్థుల ముహూర్త సమాచారం అందలేదు. కూటమి అభ్యర్థులే ముందుగా నామినేషన్లు దాఖలు చేసి జనంలో మరింతగా వెళ్లడానికి సన్నద్ధమవుతున్నారు.వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉండడంతో పాటు, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఇటీవల నిర్వహించిన ఉమ్మడి సభతో కూటమి క్యాడర్‌లో జోష్ వచ్చింది..

రేపు సీఎం జగన్ రోడ్ షో

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ గురువారం రాజమహేంద్రవరంలో పర్యటిస్తారని మంత్రి వేణు, ఎంపీ భరత్ పేర్కొన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం నుంచి గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు పొట్టిలంక వద్ద జిల్లాలోకి ప్రవేశించి వేమగిరి చేరుకుంటారు. అక్కడ భోజన విరామం తీసుకుని ముఖ్య నాయకులతో సమావేశం అవుతారు. సాయంత్రం సుమారు 4 గంటలకు మోరంపూడి చేరుకుని తాడితోట, చర్చిపేట,ఆజాద్ చౌక్, దేవీచౌక్, మునిసిపల్ కార్యా లయం జంక్షన్, ఆర్యాపురం, మల్లయ్యపేట, కాతేరు వరకూ రాత్రి 7 గంటల వరకూ రాజమహేంద్రవరంలో రూరల్,అర్బన్‌లో రోడ్ షో నిర్వహిస్తారు. అనంతరం కాతేరు నుంచి గామన్ బ్రిడ్జి అప్రోచ్ మీదుగా రోడ్డు మార్గాన దివాన్‌చెరువు నుంచి కాకినాడ జిల్లాకు వెళతారు.



ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు.ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. 21వ తేదీ ఆదివారం నామినేషన్ల స్వీకరణ ఉండదని, 26న స్క్రూట్నీ చేస్తామని, 29వతేదీ సాయంత్రం 3 గంటల వరకూ నామినేషన్లు ఉపసంహరించుకునే గడువు ఉందని తెలిపారు. 3 గంటల తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. మే 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. జూన్ 4వ తేదీన ఓట్లు లెక్కింపు ఉంటుందన్నారు. ఎంసీసీ ఉల్లంఘన సంబంధించిన 46 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘనకు సంబంధించి 41 ఫిర్యాదులు నమోదు కాగా, 39 పరిష్కరించామన్నారు. 1796 మంది వలంటీర్లు రాజీనామా చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ సేవా పోర్టల్ ద్వారా 312 ఫిర్యాదులు వచ్చాయన్నారు. సీజర్ నిర్వహణ వ్యవస్థ ద్వారా రూ.2.12 కోట్ల విలువైన వస్తువులు సీజ్‌చేసినట్టు చెప్పారు.ఆదికవి నన్నయ వర్శిటీలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశామన్నారు.జిల్లాలో 6006 మందిని బైండోవర్ చేశామని, 236 లైసెన్స్ ఆయుధాలు ఉండగా అందులో 177 డిపాజిట్ చేశామని, స్పోర్ట్స్, బ్యాంకుల వద్ద ఉన్న 58 వెపన్స్‌కు అనుమతులు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు.పోలింగ్ సిబ్బంది ఈనెల 22వ తేదీలోగా నియోజకవర్గాల ఆర్వోలకు ఫారం 12 అం దించి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం పొందాలన్నారు.

వైసీపీ కార్యక్రమాల్లో కాపులెవరూ పాల్గొనకూడదు..
పశ్చిమగోదావరి జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు

తాళ్లపూడి, ఏప్రిల్ 16 : కాపులు ఎవ్వరూ వైసీపీకి చెందిన కార్యక్ర మాల్లో పాల్గొనకూడదని పశ్చిమగోదావరి జిల్లా కాపు సంఘ అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు పిలుపునిచ్చారు.తాళ్లపూడి మండలం పెద్దేవంలోని నివాసంలో తోట రామకృష్ణను మం గళవారం పలువురు కాపు సంఘ నాయకులు కలిసి మాట్లాడారు. సమస్య తేలే వరకూ వైసీపీ నామినేషన్లు, తదితర కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు.ఇటీవల కొవ్వూరులో జరిగిన వైసీపీ సమావేశంలో కాపు జేఏసీ సభ్యుడు, వైసీపీ నాయకుడు తోట రామకృష్ణ కాపు నాయకులను ఎందుకు స్టేజ్‌పైకి పిలవడంలేదని ప్రశ్నిస్తే అదే పార్టీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే.ఈ ఘటనపై కాపు సంఘ నాయకులు మండిపడ్డారు. సంఖ్యా పరంగా ఎక్కువగా ఉన్నప్పటికీ రాజకీయంగా కాపు సామాజికవర్గాన్ని అణచివేతకు గురిచేస్తే వదిలిపెట్టేది లేదని హెచ్చరిం చారు. ప్రశ్నిస్తే దాడులు చేయడం తగదన్నారు. కొవ్వూరు మండల వైసీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ మాట్లాడుతూ కులం కంటే పార్టీ ఎక్కువ కాదని అవసరమైతే తోట రామకృష్ణ కోసం తన పదవిని కూడా వదిలేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, కొవ్వూరు ఏఎంసీ మాజీ చైర్మన్ బండి అబ్బులు, కాపు నాయకులు చీర్ల బ్రహ్మానందం, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, పశ్చిమ జడ్పీ వైస్‌చైర్మన్ తండ్రి పోసిన శ్రీకృష్ణదేవరాయలు, నామా ప్రకాశం, ముత్యాల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చినమిల్లి వెంకట్రాయుడు

వీరేశలింగం స్వగృహాన్ని మరింత అభివృద్ధిలోకి తేవాలి
కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16 : సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం స్వగృహాన్ని మరింత అభివృద్ధి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి అన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాజమహేంద్రవరం వంకాయల వారి వీధిలోని ఆయన స్వగృహాన్ని సందర్శించారు. వీరేశలింగం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరేశలింగం స్వగృహాన్ని ప్రభుత్వ పురావస్తుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో అక్కడున్న అధికారులతో పురందేశ్వరి మాట్లాడారు. వీరేశలింగం గృహాన్ని మరింతగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విషయాలపై వారితో చర్చించి పలు సూచనలు చేశారు. వీరేశలింగం మొట్టమొదట జరిపించిన వితంతు వివాహ వేదిక నమూనా వద్ద పురందేశ్వరి కుటుంబీలతో కలిసి ఫొటోలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



కందుకూరి వీరేశలింగం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

కాగితపు పూల సోయగం

సత్యవాడ ప్రత్యేకం











కాగితపు పూలను తయారు చేస్తున్న గ్రామస్థులు

సత్యవాడ(కె.గంగవరం), మార్చి15: ఆధ్యాత్మిక వాడగా పేరుగాంచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడలో శ్రీరామనవమికి ఓ ప్రత్యేకత ఉంది. భద్రాచలంలో సీతారాముల కల్యాణం ఏవిధంగా జరుగుతుందో ఇక్కడా అదే విధంగా జరుపుతారు. ఆరుబయట చలువ పందిళ్లు వేసి అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. ముఖ్యంగా ఇక్కడ పందిళ్ల అలంకరణ ప్రత్యేక ఆకర్షణ. సీతారాములు కల్యాణం చేయడానికి వేసే చలువ పందిళ్లను ఆకట్టుకునే విధంగా అలంకరిస్తారు. ఒక్కో చలువ పందిరి డెకరేషన్‌కు రూ.3 లక్షలు నుంచి 4 లక్షలు ఖర్చు చేస్తారు. అలంకరణ కోసం గ్రామంలోని ప్రతీవారు రేయంబవళ్లు కష్టపడతారు. మహాశివరాత్రి పర్వదినం నుంచి పందిళ్లలో అలంకరించే పూల కుండీల తయారీలో నిమగ్నమవుతారు. ఉగాది పర్వదినం నుంచి పందిళ్ల నిర్మాణం చేపడతారు. పందిళ్లలో పూల కుండీలు ప్రత్యేక ఆకర్షణ. ప్రత్యేకంగా విజయవాడ నుంచి తీసుకుని వచ్చిన క్రేఫ్, గున్నపేపరు, వార్నిష్ పేపరుతో గులాబీ, చామంతి, మందారం, మల్లె, పొద్దుతిరుగుడు, నైట్‌క్వీన్ వంటి పూలను కాగితాలతో తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన 50 నుంచి 80 పూలతో ఒక కుండీని తయారు చేస్తారు. ఒక్కో పందిరిలో 24 కుండీలు, అంతకంటే ఎక్కువ అలంకరిస్తారు. ఈ పూల కుండీలు సహజమైన పూల మాదిరిగా ఉండి విశేషంగా ఆకట్టుకుంటాయి. చిన్న పెద్ద తారతమ్యంలేకుండా ప్రతీవారు పందిరి అలంకరణలో పాల్గొంటారు.

సీతారాములకు తీపి కానుక













పి.గన్నవరం, ఏప్రిల్ 16: శ్రీరామనవమి రోజున శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా చేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వైనతేయ గోదావరి నది తీరాన వేంచేసి ఉన్న శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పాలకోవతో పాటు వివిధ రకాల పిండి వంటలు 100కు పైగా రకాలతో తయారు చేసిన స్వీట్లను పి.గన్నవరం గ్రామానికి చెందిన పేరిచెర్ల భీమరాజు, శ్రీమతి సత్యవాణి దంపతులు కల్యాణం రోజున సీతారాములకు సమర్పించేందుకు సిద్ధం చేస్తున్నారు. 15 సంవత్సరాలుగా స్వామి వారి కళ్యాణానికి కంతసారెను తయారు చేస్తున్నామని ఈ సారెను కల్యాణం రోజున వరుడు (రాముడు) తరపున వధువు (సీతమ్మతల్లి)కి సమర్పిస్తామని భీమరాజు, సత్యవాణి దంపతులు తెలిపారు. గత 20 రోజులుగా మహిళల సహకారంతో సుమారు 200 లీటర్ల పాలతో తయారు చేసిన కోవను ఉపయోగించి పంచె, చీరతో పాటు స్వామి వారి నామం, శంఖు చక్రాలు, పర్ణశాల, వివిధ రకాల పండ్లు, కాయలు, కూరగాయలు తదితర ఆకారాలలో సీట్లు తయారు చేశామని ఆమె తెలిపారు. ఇవే కాకుండా వివిధ రకాల పిండి వంటలు కూడా అధిక మొత్తంలో సిద్ధం చేసినట్లు ఆమె చెప్పారు. కల్యాణం రోజున ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కంతసారెను ఉంచుతామని తెలిపారు. సీతారాముల కల్యాణం అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అమ్మవారి కంత సారె ప్రసాదాన్ని అందిస్తామని ఆమె చెప్పారు. అదే విధంగా ఆలయం ఎదుట స్వామి వారి కల్యాణానికి పర్ణశాల, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిమిత్తం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. రంగులతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు.

సుందరం శ్రీరామగిరి





చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

వరరామచంద్రాపురం, ఏప్రిల్ 16: వరరామచంద్రపురం మండలంలో ప్రసిద్ధి శ్రీరామగిరి గ్రామంలో శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామివారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శబరి, గోదావరి సంగమ తీరాన ఈ దేవాలయం రెండో భద్రగిరిగా పేరుపొందింది. స్వామి వారి తిరు కల్యాణం ప్రతిఏటా శ్రీరామనవమి పర్వదినాన అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణానికి ఆలయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండపం చుట్టూ చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. రాములోరి ఆలయాన్ని పంచవర్ణాలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

రేతిరేల రాములోరి పెళ్లి





చేబ్రోలులో సీతారామ ఆలయం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు గ్రామంలో సీతారామస్వామి దేవస్థానంలో మిగిలిన ప్రాంతాలకు భిన్నంగా స్వామివారి కల్యాణం జరుగుతుంది. సాధారణంగా ప్రతిచోట పగటిపూట కల్యాణం నిర్వహిస్తే ఇక్కడ రాత్రి వేళ సీతారామ స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఇక్కడ రాత్రి పూట స్వామివారి కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తోంది. పూర్వం పీఠాపురం మహారాజా ఇక్కడ కల్యాణంలో పాల్గొనేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేసినట్లు చెబుతారు. అప్పటి నుంచి ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాలు నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఆలయ కమిటీ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

రత్నగిరిపై నవమి వేడుకలు ప్రారంభం




ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 16: సత్యదేవుడి ఆలయ క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 24 వరకు జరిగే ఈ వేడుకలలో భాగంగా సీతారాములు తొలిరోజున పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెలుగా అనుగ్రహించారు. సాయంత్రం 4 గంటలకు రామాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నవ దంపతులు కానున్న సీతారాములను పెండ్లిపెద్దలైన సత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్లను మరోవేదికపై ఆశీనులు గావించారు. ఈ సందర్భంగా పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ఉల్లూకల గౌరీపూజను నిర్వహించిన అనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ముత్తైదువులు పసుపు దంచి సీతారాములకు నుదుట తిలకం, బుగ్గను చుక్క పెట్టి దివ్యాభరణాలను అలంకరింపచేశారు. వైదిక కార్యక్రమాలను ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, వైదిక బృందం చామర్తి కన్నబాబు, గొల్లపల్లి వెంకట సుబ్రహ్మణ్య ఘనాపాటి, దేవులపల్లి ప్రసాద్ తదితరులు నిర్వహించగా పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాములోరి కల్యాణం

సీతారాముల దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా రెండో రోజైన బుధవారం ఉదయం సీతారాముల దివ్య కల్యాణం వార్షిక కల్యాణ వేదికపై అంగరంగ వైభవంగా జరగనుంది. ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, అంకురార్పణ చేస్తారు అనంతరం నవదంపతులు కానున్న సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లను వెండిపల్లకిలో గ్రామోత్సవం నిర్వహించి కల్యాణ వేదిక వద్దకు తీసుకుని వచ్చి కల్యాణ తంతుకు శ్రీకారం చుడతారు.



పసుపు దంచుతున్న ముత్తైదువులు

రేపటి నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు





ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న అధికారులు



ఆత్రేయపురం, ఏప్రిల్ 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 24 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. లక్షలాది మంది భక్తులు తరలి రానున్న దృష్ట్యా వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 18వ తేదీ గురువారం అంకురార్పణ, ధ్వజారోహణతో కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు చైత్రశుద్ధ ఏకాదశి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. అదే రోజు తీర్థం, రథోత్సవం జరుగుతాయి. 20న పొన్న వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 21న మహదాశీర్వచనం, సదస్యం. 22న గౌతమి నదిలో తెప్పోత్సవం, 23న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణ, 24 శ్రీపుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద హోర్డింగులు, అలంకరణలు చేస్తున్నారు. ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ రెండుసార్లు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ట్రస్టు బోర్డు పదవీకాలం పూర్తికావడంతో ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు ఎం.విజయరాజును ప్రత్యేకాధికారిగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఆలయ పరిసరాలు, కల్యాణ వేదిక ప్రాంగణం, పుష్కరఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

విద్యుత్ తీగ తగిలి గేదెల కాపరి మృతి

గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టిన పొలం యజమాని

నిలదీయడంతో విషయం బయటకు..మృతదేహానికి పోస్టుమార్టం





సత్తిబాబు

రౌతులపూడి, ఏప్రిల్ 16: విద్యుత్‌షాక్‌కు గురై కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన యర్రా సత్తిబాబు(42) మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యర్రా సత్తిబాబు సోమవారం గేదెలను తోలుకుని వెళ్లాడు. ఇదే గ్రామానికి చెందిన పూడి తాతీజీకి చెందిన పొలంలో కోతులు బారి నుంచి పంటను రక్షించుకునేందుకు కంచెకు విద్యుత్ అమర్చాడు. విషయం తెలియని సత్తిబాబు తాతాజీ పొలంలోకి గేదెలు పోతుంటే మళ్లించడానికి వేగంగా వెళ్లాడు. విద్యుత్ అమర్చి ఉన్న కంచెకు తగులుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. విషయం బయటకు పొక్కకుండా తాతాజీ పక్కనే ఉన్న గెడ్డలో సత్తిబాబు మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. గేదెలు తోలుకుని వెళ్లిన తండ్రి రాకపోవడంతో కుమారులు పొలంలో వెతకగా తండ్రి కన్పించలేదు. తాతాజీపై అనుమానంతో గట్టిగా నిలదీయగా జరిగిన విషయం చెప్పి మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ విద్యపతి సమక్షంలో పూడ్చిపెట్టిన మృతదేహన్ని బయటకు తీశారు. మృతదేహనికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

19న యానాంలో ఎంపీ పోలింగ్

నేటి సాయంత్రంతో ముగియనున్న ప్రచారం



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్ఎ మునిస్వామి

యానాం, ఏప్రిల్ 16: కేంద్రపాలిత ప్రాంతమైనా యానాం నియోజవర్గంలో ఈనెల 19వ తేదీ శుక్రవారం పుదుచ్చేరి పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరి రాష్ట్రానికి ఉన్న ఏకైక పార్లమెంట్ స్థానంలో మొత్తం 30 నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి యానాం. మొత్తం 10,23,699 మంది ఓటర్లు ఉన్నారు. యానాంలో 39,408 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 19,037, మహిళలు 20,371 మంది ఉన్నారు. యానాం నియోజవర్గ పరిధిలో మొత్తం 10 వార్డులకు గాను 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని ఏర్పాట్లను యానాంలోని ఎన్నికల విభాగం పూర్తి చేసింది. పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి మొత్తం 26 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. గత కొన్ని రోజులుగా యానాంలో ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. 17వ తేదీన సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఎన్డీయే అలియెన్స్‌లో ఉండటంతో బీజేపీకి మద్దతు తెలపగా స్థానిక స్వతంత్ర ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కూడా బీజేపీకి మద్దతు తెలపడంతో ఇరువురు బీజేపీకి ప్రచారం నిర్వహించడం విశేషం.

రూ.6 లక్షల పట్టివేత

పెద్దాపురం, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.6లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె. వెంటరాజగుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో కాండ్రకోట గ్రామానికి చెందిన పల్లికల రామచంద్రమూర్తి నుంచి రూ. 6లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన నగదుకు సరైన ధ్రువపత్రాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి ట్రెజరీకి జమ చేశామన్నారు.

రూ.2.97 లక్షలు స్వాధీనం

కిర్లంపూడి, ఏప్రిల్ 16: యానాం నుంచి ప్రత్తిపాడు వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.2.97లక్షలు కిర్లంపూడిలో మంగళవారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యానాంకు చెందిన సమయంతుల వెంకటసూర్య మల్లేశ్వరరావు కారులో డబ్బుతో కిర్లంపూడి మీదుగా ప్రత్తిపాడు వెళ్తున్నాడు. ఆయన వద్ద ఎటువంటి ఆధార పత్రాలు లేకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆ సొమ్మును స్వాధీన పరుచుకుని జగ్గంపేట ఆర్వో కార్యాలయానికి తరలించింది. సంబంధిత ఆధార పత్రాలు చూపిస్తే సొమ్ము తిరిగి ఇస్తామని ఆర్వో శ్రీనివాస్ తెలిపారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

రావులపాలెం, ఏప్రిల్ 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని ఓ తోటలో మంగళవారం రహస్యంగా కోడి పందేలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఆంజనేయులు సిబ్బందితో అక్కడికి చేరుకుని దాడి చేశారు. 40 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,28,400 నగదు, 15 మోటారు సైకిళ్లు, మూడు కార్లు, 13 కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ చెప్పారు.

జగన్ టూర్ షెడ్యూల్లో మార్పు

రావులపాలెం, ఏప్రిల్ 16: సీఎం జగన్ టూర్ షెడ్యూల్లో మార్పు జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు శివారు మల్లయ్యదొడ్డి సెంటరు సమీపంలోని ఒక ప్రైవేటు లే-అవుట్‌లో సీఎం మంగళవారం రాత్రి బస చేయాల్సి ఉండగా ఆ కార్యక్రమం రద్దయ్యింది. ఈ నెల 18న ఆయన బస్సు యాత్ర రావులపాలెం మీదుగా మడికి వస్తుంది.

సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

కడియం, ఏప్రిల్ 16: మండలంలోని కడియపులంక సచివాలయం-2 గ్రేడ్ 5 కార్యదర్శి ఎండీ ఫర్విన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు. ఫర్విన్ గ్రామంలో 219 పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ)గా ఉన్నారు. అయితే గ్రేడ్ 5 కార్యదర్శి బీఎల్‌వో డ్యూటీ చేయడం ఏమిటని మండలస్థాయి అధికారులకు ఎదురుచెప్పడంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ స్వయంగా ఇచ్చిన ఆదేశాలు కూడా ఆమె లెక్కచేయలేదు. దీంతో కలెక్టర్‌కు రిపోర్ట్ చేయడంతో ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నందుకుగాను ఫర్విన్‌ను సస్పెండ్ చేస్తూ మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు.

రిటర్నింగ్ అధికారులు సన్నద్ధంగా ఉండాలి

రంపచోడవరం, ఏప్రిల్ 16: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ నుంచి మంగళవారం సాయంత్రం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం నుంచి కలెక్టర్ ఎం.విజయసునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఇతర అంశాలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సులో ఆర్వోలు, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా ఏపీటీఎఫ్ 80వ ఆవిర్భావ వేడుకలు

మండపేట, ఏప్రిల్ 16: తాపేశ్వరం కేంద్రంగా 80 ఏళ్ల క్రితం అంటే 1944 ఏప్రిల్ 16న ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో సంఘం రాష్ట్రాధ్యక్షుడు జి.హృదయరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఉపాధ్యాయుల సమస్యలపై తమ సంఘం చేస్తున్న పోరాటం, సాధించిన విజయాలను వక్తలు వివరించారు. ముఖ్య అతిథిగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పుత్రసత్యశర్మ మనుమడు పుత్రసత్యశర్మ హాజరై మాట్లాడుతూ తన తాతయ్య ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడేందుకు ఏర్పాటు చేసిన సంఘం నేటికి నిర్విరామంగా కొనసాగుతుండటం హర్షణీయమన్నారు. ఉపాధ్యాయ ప్రగతి పత్రిక, ప్రధాన సంపాదకులు జి.సత్యనారాయణ, ఐపీయూ నాయకులు కె.సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివ, సీనియర్ కామ్రేడ్ రామారావు, లక్ష్మణరావు, కేవీవీ సత్యనారాయణ, ఉదయబ్రహ్మం, కనుపూరి సుబ్బారావు, కనుపూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సరికొత్త బోధనా పద్ధతులపై శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16: నూతన విద్యా విధానాన్ని అనుసరించి సరికొత్త బోధనా పద్ధతులపై అర్థశాస్త్ర అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమం మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైంది. కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకూ ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తణుకు, తాడేపల్లిగూడెం, విజయవాడ నోడల్ రిసోర్సు కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అర్థశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ వర్చువల్ విధానంలో ఈ తరగతులను ప్రారంభిస్తూ నూతన విద్యా విధానం-2020లో సింగిల్ మేజర్ సబ్జెక్టుల కోసం కళాశాల విద్య తీసుకుంటున్న విధానాలను వివరించారు. అధ్యాపకులకు దిశా నిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, నోడల్ రిసోర్స్ కేంద్రం రాజమహేంద్రవరం సమన్వయకర్త సీహెచ్ సంజీవ్‌కుమార్, నాలెడ్జ్ రిసోర్సు పర్సన్లు డీవీ నాగేశ్వరరావు, కె.యమున, కె.స్వరూప, జి.పావని దేవి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం



సీలేరు నది మోతుగూడెం వద్ద అస్తమిస్తున్న సూర్యుడు

సూర్యాస్తమయంలో దగదగలాడుతున్న భానుడు

మోతుగూడెం, ఏప్రిల్16: చింతూరు మండలం మోతుగూడెంలో పరిధిలోని సీలేరు నది వద్ద సంధ్యా సమయంలో సైతం మిరుమిట్లు కొలుపుతున్న భానుడి అందాలు. వీటిని పర్యాటకులు ఎంతో ఆనందంతో తిలకించారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు

● జిల్లా కలెక్టరు విజయ సునీత



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టరు విజయసునీత

రంపచోడవరం, ఏప్రిల్ 16: త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఎం.విజయ సునీత చెప్పారు. స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ నిర్వహించే హాలు, స్ట్రాంగ్‌రూమ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ తదితర ప్రదేశాలను ఆమె సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మ్యాప్ పాయింట్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. తహశీల్దార్లు ఎ.కృష్ణజ్యోతి, నాగరాజు, డీటీలు సత్యనారాయణ, చైతన్య, శ్రీధర్, విశ్వనాథం, శివ, సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ మోహన్‌రావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ఈవీఎంలు సిద్ధం : సబ్‌కలెక్టర్

రంపచోడవరం, ఏప్రిల్ 16: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు సిద్ధం చేసినట్లు రంపచోడవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్ చెప్పారు. మంగళవారం ఆయన తన కార్యాలయ చాంబరులో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీ ప్యాడ్లను స్ట్రాంగ్‌రూమ్‌లో పోలీసు భద్రత మధ్య ఉంచినట్లు చెప్పారు. నామినేషన్ సమర్పించే అభ్యర్థితో ఐదుగురిని కార్యాలయంలోకి అనుమతిస్తామని చెప్పారు. పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు తెలియపరిచే విధంగా మండల స్థాయి అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. గుర్తేడు, పాతకోట పోలింగ్ అనంతరం ఈవీఎంలు, ఇతర సామగ్రిని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించేందుకు హెలికాప్టర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో కౌంటింగ్ ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి నివేదికలు సమర్పించినట్లు తెలిపారు.

'దళితుల శిరోముండనం కేసులో శిక్షను పెంచాలి'

రంపచోడవరం, ఏప్రిల్ 16: దళితులకు శిరోముండనం చేసిన కేసులో ముద్దాయి తోట త్రిమూర్తులుకు శిక్షను పెంచాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం కోసం సుదీర్ఘకాలం పాటు పోరాడిన దళిత, ప్రజాస్వామిక విప్లవ శక్తుల పట్టుదలను ఆయన కొనియాడారు. త్రిమూర్తులుకు ఈ శిక్ష సరిపోదని, శిక్షను పెంచితేనే దళితులకు న్యాయం జరుగుతుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే వంతలకే మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దేవీపట్నం, ఏప్రిల్ 16: రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే టీడీపీ నాయకురాలు వంతల రాజేశ్వరికే తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు దేవీపట్నం మండల టీడీపీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఇందుకూరులో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు ముచ్చు త్రిమూర్తులు ఆధ్వర్యంలో మండల టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఐదేళ్ల పాటు మన్యంలో టీడీపీ ఉనికి నిలబెట్టిన వంతలకు టిక్కెట్ ఇవ్వకపోవడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు. నగేష్, బాబురావు, చంటి, అరకు పార్లమెంట్ నాయకులు నాగేశ్వరరావు, రత్నం, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, నాయకులు హరిశ్చంద్రుడు, నాని, పోశమ్మ, గౌరీశ్వరి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనిలో ఆన్‌లైన్ హాజరు సమస్య పరిష్కరించాలి

ఎటపాక, ఏప్రిల్16: ఉపాధి హామీ పనిలో ఆన్‌లైన్ హాజరు సమస్య పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎటపాక మండలం పట్టుచీర గ్రామంలో ఉపాధి కూలీ పనులను సీపీఐ నాయకులు సందర్శించారు. సీపీఐ డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము, ఎంపీటీసీ కంటే రాజు మాట్లాడుతూ సర్వర్ సమస్యతో కూలీల హాజరు పూర్తిస్థాయిలో నమోదు అవ్వడం లేదన్నారు. ఆన్‌లైన్ రద్దు చేసి మాన్యువల్ హాజరు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, కూలీలకు మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. సీపీఐ నాయకులు వరద బ్రహ్మం మూతయ్య, చంటి, వెంకటేష్, సత్యం, బద్దెపూడి బాబు, ఏసు పాల్గొన్నారు.

గొత్తికోయలకు పోలీసుల వితరణ

కూనవరం, ఏప్రిల్ 16: మండలంలోని రామచంద్రపురంలో నివాసముంటున్న గొత్తికోయలకు కూనవరం ఎస్‌ఐ శ్రీనివాస్ మంగళవారం నిత్యావసర సరుకులను అందజేశారు. మారుమూల ప్రాంతంలో అడవుల్లో నివసిస్తున్న గొత్తికోయలకు నిత్యావసర సరుకులు అందించినట్లు చెప్పారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సామాన్యులతో పోలీసులు స్నేహభావంతో ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజల శాంతిభద్రతలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనని ఎస్‌ఐ తెలిపారు.

నవయుగ వైతాళికుడు 'కందుకూరి'

వీరేశలింగం పంతులు జయంతిలో టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16: స్త్రీ విద్య కోసం ఉద్యమించి ప్రచారం చేయడమే కాకుండా బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిన నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు అని రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ నాయకులు, రాజమహేంద్రి మహిళా విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలోని కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల వద్ద ఆనంద గార్డెన్స్ స్మృతి వనంలోని కందుకూరి దంపతుల సమాధులకు టీకే విశ్వేశ్వరరెడ్డి తదితరులు పూలమాలలు దండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ సభ్యులు ఎల్‌వీ ప్రసాద్, వెంకట్, శ్రీను పాల్గొన్నారు. ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, సూపరింటెండెంట్ మూర్తి, వై.స్వర్ణశ్రీ, డీవీ రమణమూర్తి, జి.వెంకటరమణ, ఎం.లలిత రమ్య, కె.రూపాదేవి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల వద్ద ఆనంద్ గార్డెన్స్ కందుకూరి స్మృతి వనంలోని కందుకూరి వీరేలింగం పంతులు సమాధులకు రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ సభ్యులు టీకె విశ్వేశ్వరరెడ్డి, ఎల్‌వీ ప్రసాద్ పూలమాలలతో నివాళులర్పించారు.



కందుకూరి దంపతుల సమాధులకు నివాళులర్పిస్తున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

● రాజమహేంద్రవరం పురమందిరంలో వీరేశలింగం విగ్రహానికి జూబ్లీ లైబ్రరీ కార్యదర్శి, ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీ పోతుల వీరభద్రరావు ట్రస్ట్ చైర్మన్, కళాగౌతమి బులుసు వి.ఎస్‌మూర్తి, ఆచార్యులు తెరపట్ల సత్యనారాయణ, ఎస్‌కేవీటీ తెలుగు శాఖాధిపతి పీవీసీ సంజీవరావు, టౌన్ హాల్ లైబ్రేరియన్ వీటీవీ సుబ్బారావు, కురుమళ్ల ఆంజనేయులు, గట్టి ప్రభ, బొబ్బిలి భాస్కరరావు, చీరల సీతారామనాయుడు పాల్గొన్నారు. కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు వీరేశలింగం పంతులు జయంతిని నిర్వహించారు.

బాలికల సదనాన్ని సందర్శించిన డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలికల సదనాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మంగళవారం సందర్శించారు. బాలికలతో మాట్లాడి సదుపాయాలపై ఆరా తీశారు. బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని సూచించారు. పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. సదనంలో ఏ విధమైన అసౌకర్యం ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాలికల చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎండ వేడిమి వల్ల వాళ్ల అనారోగ్యానికి గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సదనం సిబ్బందిని ఆమె ఆదేశించారు.

నర్సరీలకు టీడీపీతోనే మేలు

● ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల



కడియపులంక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల

కడియం, ఏప్రిల్ 16: కడియం నర్సరీలకు టీడీపీతోనే మేలు జరిగిందని, ఉమ్మడి కూటమి అధికారంలోకి రాగానే నర్సరీలకు మరింత అభివృద్ధి చేస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. కడియపులంక విశ్వేశ్వరహైటెక్ నర్సరీలో మంగళవారం టీడీపీ-జనసేన-బీజేపీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల మాట్లాడుతూ నర్సరీ రైతులకు ఉచిత విద్యుత్ జీవో ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదే అన్నారు. కూటమి అధికారంలోకి రాగానే నర్సరీలు మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు చేస్తామన్నారు. అలానే గతంలో ప్రారంభోత్సవం చేసి మధ్యలో నిలిచిపోయిన నర్సరీరైతుల భవనం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, పంతం గణపతి, గట్టి నర్సయ్య, ముద్రగడ జమీ, వెలుగుబంటి నాని, పాటంశెట్టి రాంజీ, కలిదిండి గోవిందు, చెక్కపల్లి మురళి, ఆకుల శ్రీధర్, బోడపాటి గోపి, బొర్రు సుబ్రహ్మణ్యం, జంగా వినోద్, ముత్తాబత్తుల విజయ, బోడపాటి రాజేశ్వరి, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో నిత్యం కష్టాలే

● గుడ్ మార్నింగ్‌తో మీ ఇంటికి మీ గోరంట్ల కార్యక్రమం

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 16: రాష్ట్ర ప్రజలందరికీ జగన్ రెడ్డి హత్యా రాజకీయ చరిత్ర తెలిసిందేనని, వైసీపీ పాలనలో ప్రజలు నిత్యం అష్టకష్టాలు పడుతున్నారని రూరల్ నియోజక వర్గం కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. గుడ్ మార్నింగ్‌తో మీ ఇంటికి మీ గోరంట్ల కార్యక్రమంలో భాగంగా రాజ హేంద్రవరం 19వ వార్డులో మాజీ కార్పొరేటర్ గొందేసి మాధవీలత, హరినాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, కొయ్యన కుమారి, మజ్జి పద్మ, బోగవల్లి రామారావు, పివీ సుబ్రహ్మణ్యం, ఏలూరి వెంకటేశ్వరరావు, మానుపాటి తాతారావు, మత్తబత్తుల విజయకుమారి, చిట్టిబోయిన శ్రీనివాస్, మద్ద మణి, కుక్కల రమేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన టీడీపీ నేత యర్రా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరావు దంపతులను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరంలో దగ్గుబాటి నివాసంలో మంగళవారం వారిని కలిసి పలు అంశాలపై చర్చించారు. కూటమి విజయం తథ్యమని, పురందేశ్వరిని పార్లమెంట్‌కు పంపించేందుకు నియోజకవర్గప్రజలు సిద్ధంగా ఉన్నారని యర్రా అన్నారు.

వివేకాది గుండెపోటా..గొడ్డలి పోటా తేల్చి జగన్ ఓట్లు అడగాలి

● ఎన్నికల ప్రచారంలో జ్యోతుల నెహ్రూ



గోకవరం, ఏప్రిల్ 16: బాబాయ్ వివేకానందరెడ్డిది గుండెపోటా, గొడ్డలి ఫొటో తేల్చాకా ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రజలను ఓట్లు అడగాలని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విమర్శించారు. మండలంలోని రంపయర్రంపాలెంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న ప్రతీసారీ జగన్ శవరాజకీయాలు, కుట్ర రాజకీయాలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఊలపల్లిలో నల్లమిల్లి ఇంటింటా ప్రచారం



ఊలపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న నల్లమిల్లి

బిక్కవోలు, ఏప్రిల్ 16: ఊలపల్లి గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఎన్‌డీఏ మేనిఫెస్టోను ప్రతి ఒక్కరినీ కలసి వివరించారు. ఎమ్మెల్యే, ఎంపీలకు సైకిలు, కమలం గుర్తులపై ఓటు వేయాలని కోరారు. ఈయన వెంట మాజీ జెడ్‌పీటీసీ కరుపోతు రాణి, దేశం నేతలు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, రాయుడు రామచంద్రరావు, గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రేడులో మహాలక్ష్మి ప్రచారం

రంగంపేట: మండలంలోని పెదరాయవరం గ్రామంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవింద్, రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, మండల అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, మోదుకూరి గోపాలకృష్ణ, మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో గిడుగు, బోడా ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16: రాజమహేంద్రవరం కొత్తపేట రౌతు తాతాలు కళ్యాణ మండపం సమీపంలో మంగళవారం సాయం త్రం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, రాజమహేద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్ ప్రచారం చేశారు. ప్రత్యేక, హోదా, విభజన హామీలు, తదితర 9 గ్యారెంటీలపై ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రణాళిక పూర్తి

● సిబ్బందితో సమీక్షలో ఆర్‌వో దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం ఆర్‌వో దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16: రాజమహేద్రవరం సిటీ నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రణాళిక పూర్తి చేసినట్లు ఆర్‌వో దినేష్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం సిటీ ఎన్నికల సామగ్రి పంపిణి కేంద్రమైన ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్నికల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీకి 20 బృందాలను నియమించామని, ఒక్కొక్క బృందంలో ఆరుగురు సిబ్బంది ఉంటారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మొత్తం సామగ్రి ఇక్కడే ఉంటుందన్నారు. ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పోలింగ్ స్టేషన్లు వచ్చేనెల 12న ఉదయం కేటాయిస్తామన్నారు. సామగ్రిని, పోలింగ్ సిబ్బందిని వారికి కేటాయించిన పోలింగు స్టేషన్లకు బస్సుల ద్వారా చేరుస్తామన్నారు. సెక్టారు అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, ఎన్నికల రోజు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి రిపోర్టు తీసుకోవాలని ఈ కార్యక్రమాన్ని పూర్తి నిబద్ధతతో అత్యంత జాగరుకతతో నిర్వహించాలన్నారు. పంపిణీ కేంద్రంలో చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్‌ఈ జి.పాండురంగారావు, డీఎస్పీ కె.విజయపాల్, తహశీల్దార్ కె.ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్లు, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ ఓట్లను అరికట్టండి

● తహసీల్దార్‌కు కూటమి అభ్యర్థి బత్తుల వినతి



తహసీల్దార్ రెహమాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, ఏప్రిల్ 16 : రాజానగరం నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని రాజానగరం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మంగళవారం రాజానగరం తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్‌కు వినతి పత్రం అందజేశారు. దొంగ ఓట్లకు సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన జాబితాలను అధికారులకు అందజేశారు. అనంతరం బలరామకృష్ణ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే డోరు నెంబరు లేకుండా 2500 ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు ఓట్లుగా ఉన్నవి సుమారు 5 వేల ఓట్లు, భార్యాభర్త ఉంటున్న ఇంట్లో రెండు ఓట్లకు బదులుగా 10 దొంగ ఓట్లుగా నమోదైనట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు కంచుపట్ల రామకృష్ణ, గళ్లా రంగ, కుర్రే శ్రీను, తోట రామకృష్ణ, అడపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ వివరణ

ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణకోరగా ముందుగా ఫిర్యాదు చేసి ఉంటే బాగుండేది. తొలగింపుల ప్రక్రియ సమయం దాటిపోయింది. అయినప్పటికి సదరు విషయాన్ని రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళతానని తహసీల్దార్ రెహమాన్ తెలిపారు.

సీతానగరంలో బత్తుల వెంకటలక్ష్మి ప్రచారం

సీతానగరం: కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మంగళవారం సీతానగరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బత్తుల బలరామకృష్ణను, పురందరీశ్వరిని గెలిపించాలని కోరుతూ బత్తుల వెంకటలక్ష్మి, కుమార్తె తోట ప్రత్యూషాదేవిలు ప్రచారం నిర్వహించారు. తోట పవన్, పెందుర్తి అచ్చుతరామారావు, గద్దే వెంకటకృష్ణచౌదరి, గెడ్డం తిమ్మారావు, కోటేశ్వరరావు, నీరుకొండ శివ, శ్రీనివాసరావు, వలవల రాజా, నానాజీ జనసేననాయకులు పాల్గొన్నారు

వైసీపీ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం

కడియం, ఏప్రిల్ 16: కోడికత్తి శ్రీను డ్రామాతో ఆరంభమై నేడు గువ్వరాయితో గాయమై జగన్ ఎన్నికల్లో సానుభూతి పొందాలని చూస్తున్నారని టీడీపీ ఎస్సీసెల్ నాయకులు తెలిపారు. మంగళవారం కడియం మండలం వేమగిరిలో టీడీపీ ఎస్సీసెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి జల్లి కృపారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కాయల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మాకే బూషణం తదితరులు మాట్లాడారు. వైసీపీ పాలనలో దళితులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి జల్లి కృపారావు, జిల్లా ఉపాధ్యక్షులు కాయల సత్యనారాయణ, దళిత నాయకులు బొల్లాడి జాన్‌బాబు, చిల్లి ధర్మదాసు, కనికెళ్ళ బుల్లియ్య, చింతపర్తి నాగేశ్వరరావు, మందపల్లి రతన్‌రాజు, విప్పర్తి శ్రీను, ప్రత్తి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

కోరుకొండ, ఏప్రిల్ 16: బుధవారం శ్రీరామనవమి సందర్భంగా కోరుకొండ మండలంలోని 22 గ్రామాల్లో నవమి వేడుకలు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మండలంలోని సుమారు 96 రామాలయాలు వద్ద శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు సన్నద్ధమయ్యారు. మండల ప్రధాన కేంద్రం కోరుకొండ హరేరామ సమాజం వద్ద మంగళవారం సీతారామ లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కల్యాణానికి ముందురోజు స్వామి వారికి పంచామృతఅభిషేకాలు నిర్వహించడం సాంప్రదాయం. అదే విధంగా ఆర్యవైశ్య కోదండ రామాలయం వద్ద గాదరాడ, ఓం శివశక్తి పీఠంలో, శ్రీరంగపట్నం, బూరుగుపూడి, పశ్చిమగోనగూడెం, కాపవరం గ్రామాల్లో స్వామివారి పంచామృత అభిషేకం కన్నుల పండువగా జరిగింది.

చెక్‌పోస్ట్ వద్ద లక్ష రూపాయలు స్వాధీనం

రంగంపేట, ఏప్రిల్ 16: రంగంపేట మండలం రామేశంపేట చెక్‌పోస్ట్ వద్ద ఎటువంటి అధికార పత్రాలు లేని లక్ష రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ మేజిస్ట్రేట్ కె.వెంకటరత్నం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆదిత్య కళాశాల సూరంపాలెం నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న పితాని లలిత తమ వాహనంలో ఉదయం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలో గుర్తించించినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకొని జిల్లా ఉన్నతాధికారులకు సొమ్మును రంగంపేట ఎస్‌ఐకు అప్పగించారు. కార్యక్రమంలో వీఆర్వో దొరబాబు, ఎఫ్ఎస్టీ కానిస్టేబుల్ జీవీ ఎస్‌ఎస్ రెడ్డి, చెక్‌పోస్ట్ ఏఎస్‌ఐ వి.త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేకహోదా

కడియం, ఏప్రిల్ 16: ప్రస్తుతం రాష్ట్రంలో రాళ్ల రాజకీయం జరుగుతుందని రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ అన్నారు. మంగళవారం కడియంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ఆనాడు మంత్రిగా పనిచేసిన జక్కంపూడి రామ్మోహనరావు హయాంలో అభివృద్ధి జరిగిందని, ఆయనతోపాటు పనిచేసిన తనకు నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మొదటి సంతకం ప్రత్యేకహోదాపై పెడతామన్నారు.

గ్లోబల్ అంబాసీడర్‌గా ఆరుమిల్లి చక్రవర్తి



గ్లోబల్ అంబాసీడర్‌గా నియమితులైన రాజమహేంద్రవరం వాసి ఆరుమిల్లి చక్రవర్తి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16: గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీతంపేటకు చెం దిన ఆరుమిల్లి చక్రవర్తి ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ అంబాసీడర్‌గా ఎంపికయ్యారు. రాజమహేంద్రవరానికి చెందిన దివంగత గ్రంథాలయాధికారి ఆ రుమిల్లి రంగారావు కుమారుడు చక్రవర్తి. ఆయ న ప్రపంచ ప్యాకేజింగ్ అండ్ ఫార్మా రంగంలో దిగ్గజ పారిశ్రామికవేత్తగా ఎదిగారు. తాజాగా చక్రవర్తి వరల్డ్ ప్యాకేజింగ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూపీవో) గ్లోబల్ అంబాసీడర్‌గా నియమితులయ్యా రు. డబ్ల్యూపీవో తొలి మహిళా ప్రెసిడెంట్ బ్రెజిల్‌కు చెందిన లూసియానా పెల్లెగ్రినో ఈ విషయాన్ని ప్రకటించారు. అలాగే జాతీయ స్థాయిలో ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా ఎంట్ర ప్రెన్యూర్స్ (ఎఫ్‌వో పీఈ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఏపీ, తెలంగాణ చైర్మన్‌గా కూడా చక్రవర్తి నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఖ్యాతిని ప్రపంచానికి చాటిన చక్రవర్తికి ఆయన స్నేహితులు అభి నందనలు తెలిపారు.

కూటమి విజయం తథ్యం

» ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

» వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు





47,48వ డివిజన్లకు చెందిన వైసీపీ నాయకులను కండువాలతో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, 37వ డివిజన్‌లో బాజీ, కరీమ్‌లను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్


రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16: రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధించడం తథ్యమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 47, 48 డివిజన్లకు చెందిన బలమైన నాయకుడు అజ్జరపు రమేష్, వైసీపీ నాయకులు అజ్జరపు శ్యామలాదేవి, మామిడిశెట్టి నాగార్జున, రొబ్బి మహేష్, ఉర్రింకి దుర్గ, మహేష్, వెలిగట్ల భాస్కర్, బొంక సరోజిని, రమణీతో సహా సుమారు 200 మంది టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆదిరెడ్డి శ్రీనివాస్‌తోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నేత దగ్గుబాటి హితేష్ చెంచురామ్, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి పాల్గొనివైసీపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వాసు మాట్లాడుతూ వైసీపీని భారీ స్థాయిలో వీడి టీడీపీలోకి నాయకులు, కార్యకర్తలు వస్తున్నారని, ఆ పార్టీ ఖాళీ అయిపోతుందన్నారు. ఎంపీ భరత్‌రామ్ అతని భజనపరులు తప్పితే ఆ పార్టీలో ఎవ్వరూ ఉండరన్నారు. కార్యకర్తలంతా కూటమి విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు.

● 37వ డివిజన్‌కు చెందిన 100 మంది టీడీపీలోకి..

రాజమహేంద్రవరం 37వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు వంద మంది టీడీపీలోకి చేరారు. డివిజన్ ఇన్‌చార్జి ఉర్లంకల లోకేశ్ ఆధ్వర్యంలో యూత్ సర్కిల్ నాయకులు బాజీ, కరీమ్ సహా 100 మంది స్థానిక తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. వారిని ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అయ్యాక అభివృద్ధి ఎలా వుంటుందో చూపిస్తారని వాసు అన్నారు.

నాయీబ్రాహ్మణులకు టీడీపీలోనే మేలు : దాస్యం

నాయీబ్రాహ్మణులకు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మేలు జరిగిందని నాయీబ్రాహ్మణ నేత, తెలుగుదేశం పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో నాయీబ్రాహ్మణులు నిరాదరణ గురయ్యారన్నారు. చేదోడు పథకం కింద రాష్ట్రంలో 2.5 లక్షల మందికి ఇవ్వాల్సివుండగా 25 వేల మందికి మాత్రమే ఇచ్చారన్నారు. నగరంలో నాయీబ్రాహ్మణులకు మేలు చేయలేని భరత్‌రామ్ మాత్రం చీటికి మాటికి ఆదిరెడ్డి కుటుంబాన్ని ఆడిపోసుకుంటున్నాడని, ఆదిరెడ్డి వాసు, అప్పారావులను విమర్శించే అర్హత, స్థాయి ఆయనకు లేదన్నారు. టీడీపీ హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా లక్ష సబ్సిడీ కింద రెండు లక్షల రుణాలు, నాయీబ్రాహ్మణులకు వృత్తినైపుణ్య శిక్షణ ఇప్పించారని చెప్పారు. దేవదాయ శాఖ ట్రస్టుల్లో నాయీబ్రాహ్మణులను సభ్యులుగా నియమించాలని గవర్నర్ జీవో జారీ చేస్తే దానిని శాసన మండలి, అసెంబ్లీలో తీర్మానాలు చేయలేదన్నారు. టీడీపీ ఒత్తిడి చేస్తే ఎట్టకేలకు సభ్యులను నియమించారన్నారు. కూటమి అధికారంలోకి వస్తే సెలూన్ షాపులపై విధిస్తున్న చెత్త పన్ను రద్దుచేస్తారన్నారు. సమావేశంలో టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు అలజంగి దేవుడు, కోటిపల్లి చంద్రశేఖర్, కందికొండ అనంత్, కోరుపల్లి నాగేశ్వరరావు, పెండ్యాల నాగేశ్వరరావు, తాడి దుర్గాప్రసాద్, జామి ప్రసాద్, పెండ్యాల ఉమామహేష్, పాలవలస లోకేష్, బర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





27 ఏళ్ల కిందట శిరోముండనానికి గురైన బాధితులు (ఫైల్)

కోర్టు తీర్పుతో దళితులకు న్యాయం



శిరోముండనం కేసులో నిందితులకు 18 నెలల జైలు శిక్ష విధించడంతో కోర్టుపై చాలా నమ్మకం కలిగింది. ఈ కేసులో న్యాయం కోసం 28 ఏళ్లుగా ఎదురు చూశాం. కోర్టు తీర్పుతోదళితులకు న్యాయం జరిగింది. - **కనికెళ్ల గణపతి, బాధితుడు**

27 ఏళ్లు కోర్టుల చుట్టూ తిరిగాం



27 ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగాం. ముద్దాయిలకు ఎట్టకేలకు శిక్ష ఖరారు చేయడంతో సంతోషంగా ఉన్నా. మిగిలిన బాధితులు, నాయకులతో కలిసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటాం.- **చల్లపూడి పట్టాభి, బాధితుడు**


కేసు నిలిపిన ఘనత బొజ్జా తారకానిదే



పుట్టుస్వామి కమిషన్ నివేదికతో అప్పటి ప్రభుత్వం శిరోముండనం కేసు ఎత్తివేసింది. హైకోర్టు న్యాయవాది బొజ్జా తారకం మాండమస్ రిట్ వేసి కేసు విచారణ పునఃప్రారంభించేలా చేశారు. -**వి.భీమశంకరం, దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్**

వివాదాల తోటలో.. ధర్మమే గెలిచింది!

శిరోముండనం కేసులో 27 ఏళ్ల తర్వాత జైలు శిక్ష



తోట త్రిమూర్తులు, మండపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

- మండపేట వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు సహా 9 మందికి శిక్ష
- 18 నెలలు తక్కువ శిక్షపై ఆవేదన
- మళ్లీ పోరాడతామంటున్న బాధితులు
- వెంకటాయపాలెంలో హర్షం
- మూడేళ్ల కిందట వైసీపీ ఎంపీ బోస్ ఫిర్యాదు
- నాడు చర్చనీయాంశమైన అంశం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకటికాదు రెండు కాదు.. ఏకంగా 27 ఏళ్ల పైమాటే.. న్యాయం కోసం తిరగని కోర్టు లేదు.. ఎట్టకేలకు సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. శిరోముండనం నిందితులకు శిక్ష ఖాయమైంది. కానీ తీర్పు వచ్చిన ఆనందంకంటే తమకు అసలైన న్యాయం జరుగుతుందని ఇన్నేళ్లూ నిరీక్షించిన క్షణాలకు విలువ లేకుండా పోయిందని ఆ బాధితులు వాపోతున్నారు. న్యాయం కోసం 27 ఏళ్ల కళ్లుకాయలు కాసేలా ఎదురుచూసి మానసిక క్షోభతో శిక్ష అనుభవిస్తే నిందితులకు కేవలం 18 నెలలే జైలుశిక్ష పడడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తగిన న్యాయం కోసం మళ్లీ పోరాటం చేస్తామని చెప్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శిరోముండనం కేసు తీర్పు జిల్లాలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కేసులో తీర్పు రావడానికి ఇన్నేళ్ల నిరీక్షణకు కారణాలేమిటనే చర్చ జరుగుతోంది.

అప్పట్లో పెను సంచలనమై..

రామచంద్రపురం నియోజకవర్గానికి 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తోట త్రిమూర్తులు ఎమ్మెల్యేగా నెగ్గారు. ఆ ఎన్నికల్లో అదే మండలం వెంకటాయపాలేనికి చెందిన ఐదుగురు దళిత యువకులు, త్రిమూర్తులు మధ్య రాజకీయ విబేధాలు తలెత్తాయి. ఈ క్రమంలో ఐదుగురు దళిత యువకులను చిత్రహింసలకు గురిచేసి ఇద్దరికి శిరోముండనం చేయించారు. ఒక ఎమ్మెల్యే ఇలా దళితులను అవమానించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. దీంతో అప్పట్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదిత్య త్రిపాఠి నేరుగా వెంకటాయపాలెం వెళ్లి విచారణ చేపట్టి 1997 జనవరి 4న ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నెం.1/1997 కింద ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మొత్తం 10 మందిని నిందితులుగా గుర్తించగా.. నాడు ఎమ్మెల్యేగా ఉన్న తోట త్రిమూర్తులును ఎ1గా నిర్ధారించారు. జనవరి 7న త్రిమూర్తులును పోలీసులు అరెస్టు చేశారు. జనవరి 18న కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేయగా న్యాయస్థానం ఆదేశాల మేరకు 87 రోజుల పాటు త్రిమూర్తులుతో పాటు మరికొందరు సహా నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత వీరు బెయిల్‌పై విడుదలయ్యారు. 1997 అక్టోబరు 15న కేసును రాజమండ్రి నుంచి విశాఖలోని ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేశారు. పుట్టుస్వామి కమిషన్ రంగంలోకి దిగి 1998లో కేసు విచారణ చేపట్టింది. కమిషన్ నివేదిక ఆధారంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేసును ఉపహరించుకుంటూ జీవో జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు ఆందోళనలకు దిగాయి. అప్పట్లో న్యాయవాది బొజ్జా తారకం తదితరులు హైకోర్టును ఆశ్రయించగా కేసు మళ్లీ విచారణ మొదలైంది. నిందితులు 2006లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బాధితులు దళితులు కాదని, బీసీ వర్గం కిందకు వస్తారంటూ ఫిర్యాదులు వచ్చాయి. అయితే ఇవేవీ న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఈ కేసులో 2020లో వైసీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి. శిరోముండనం కేసుపై 2020 నవంబరులో ఎంపీ బోస్ రాష్ట్ర హోంమంత్రికి లేఖ రాయడం కలకలం రేపింది. ఎన్నో ఏళ్ల కిందట జరిగిన శిరోముండనం కేసులో విచారణను వేగవంతం చేయాలని ఆ లేఖలో అప్పట్లో బోస్ డిమాండ్ చేశారు. దళితులకు అన్యాయం చేసిన నేపథ్యంలో సొంత పార్టీ అయినా సరే త్రిమూర్తులును వదిలిపెట్టేది లేదని అప్పట్లో పేర్కొన్నారు. తాజా తీర్పు పైనా బోస్ స్పందించారు. పూర్తి తీర్పు చదివిన తర్వాత ఏం చేయాలో నిర్ణయిస్తానన్నారు.

జగన్ పాలనలో దళితులకు రక్షణేది..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దళితులకు రక్షణ లేకుండా పోయింది. ఒక పక్క నా ఎస్సీలు అంటూనే జగన్ ప్రభుత్వం దళితులను నిలువునా మోసం చేసి రోడ్డున పడేస్తే.. ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ వారిపై దాడులు, హత్యలకు తెగబడ్డారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలే కాకినాడలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య ఘటన. 2022 మే 18న తన వద్ద పనిచేస్తున్న కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అర్ధరాత్రి కాకినాడ బీచ్ రోడ్డులో హత్య చేసి మరునాడు మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకువచ్చాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరంలో వరప్రసాద్ అనే దళిత యువకుడికి పోలీస్ స్టేషన్‌లోనే కొందరు వైసీపీ నేతలు శిరోముండనం చేశారు. 2022 జనవరిలో కాకినాడ జిల్లా సామర్లకోటలో పోలీసుల వేధింపులు తాళలేక దళిత యువకుడు గిరీష్‌బాబు ఆత్మహత్య చేసుకున్నాడు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో జాతరలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో దళిత యువకుడు రాము మృతి చెందాడు. కోడికత్తి కేసులో దళిత యువకుడు శ్రీను జైలుపాలయ్యాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలోని మలకపల్లిలో దళిత యువకుడి హత్య, దొమ్మేరులో వైసీపీ నేతల ఒత్తిడితో దళిత యువకుడి ఆత్మహత్య జరిగాయి. ఇలా అనేక మంది దళిత యువకులు అధికార పార్టీ అరాచకాలకు బలయ్యారు.

ఇన్నేళ్లలో 10 మందికిపైగానే మృతి...

27 ఏళ్ల పాటు సుదీర్ఘంగా కొనసాగిన కేసులో బాధితులు, సాక్షుల్లో అనేక మంది చనిపోయారు. కేసులో మొత్తం 24 మంది సాక్షులుగా ఉండగా వీరిలో 10 మంది చనిపోయారు. బాధితుల్లో ఒకరు, ముద్దాయిల్లో ఒకరు చనిపోయారు. అయితే 2019 నాటికి ఈ కేసు 146సార్లు వాయిదా పడింది. 27 ఏళ్లు దాటినా తీర్పు రాకపోవడంతో బాధితుల్లో నిరాశ ఆవహించింది. అయినా పట్టు వదల్లేదు. ఎట్టకేలకు తీర్పు వచ్చినా నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రస్తుత మండపేట వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుకు విధించిన శిక్ష చాలా చిన్నదని బాధితులు వాపోయారు. 27 ఏళ్ల పాటు తీర్పు ఇవ్వకుండా నిందితుడికి 18 నెలల జైలుశిక్ష విధించిందని మంగళవారం రామచంద్రపురంలో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

దళిత వ్యతిరేకులకు సీట్లా?

ముప్పాళ్ల సుబ్బారావు, న్యాయవాది



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దళితులకు శిరోముండనం చేసిన తోట త్రిమూర్తులుకు మండపేట నుంచి అధికార వైసీపీ సీటు ఖరారు చేసిందని.. కోర్టు తీర్పు నేపథ్యంలో దళిత వ్యతిరేకులను వైసీపీ పోటీకి నిలుపుతుందా? లేక అభ్యర్థిని మారుస్తుందా? అని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు ప్రశ్నించారు. దళితులకు అనుకూలమని చెప్పుకునే జగన్ తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



శిక్ష సరిపోదు.. పోరాడతాం!

దళిత ఐక్య వేదిక సంఘం నాయకులు

శిరోముండనం కేసులో తీర్పుపై హైకోర్టులో పోరాటం చేస్తామని దళిత ఐక్య వేదిక ప్రకటించింది. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు వీరేశగుళ్ల కాలనీలోని గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 27 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న బాధితులు, దళితులకు కోర్టు తీర్పు నిరాశ కలిగించిందన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ, మండపేట వైసీపీ అభ్యర్థిగా ఉన్న తోట త్రిమూర్తులును కోర్టు దోషిగా ప్రకటించిందని.. జగన్ ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వానికి దగాపడ్డ దళితులే తీర్పు చెబుతారన్నారు. నిందితులకు 18 నెలల జైలు, జరిమానా విధించడం.... .వెంటనే బెయిల్ మంజూరు చేయడం చూస్తుంటే బాధితులకు నష్టం కలిగినట్టు ఉందన్నారు. తదుపరి కార్యాచరణ నిర్దేశించుకుని న్యాయపరమైన ప్రక్రియలో ముందుకు సాగుతామని తెలిపారు. సమావేశంలో దళిత ఐక్య వేదిక సహ కన్వీనర్ చీకట్ల వెంకటేశ్వరరావు, శిరోముండనం బాధితుడు కోటి చినరాజు, దళిత ఐక్య వేదిక నాయకులు గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, రేవు నాగేశ్వరరావు, బి.సిద్ధు, అంబటి కృష్ణ, సాదే రాజేష్, మేడిశెట్టి ఇజ్రాయిల్, చిన్న పాల్గొన్నారు.

తోట త్రిమూర్తులును ఎన్నికలకు దూరంగా ఉంచాలి

దళితుల పట్ల ఎవరు అమానుషంగా ప్రవర్తించినా శిక్ష తప్పదని న్యాయస్థానాలు మరొకసారి రుజువు చేశాయి. దళితుల శిరోముండనం ఘటనలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు ఎట్టకేలకు శిక్షపడడం హర్షణీయం. దళితుల ఓట్లతో మరొకసారి గద్దెనెక్కేందు కు జగన్ కపట ప్రేమ కురిపిస్తున్నాడు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి సిగ్గు తెచ్చుకుని తోట త్రిమూర్తులు ఎమ్మెల్సీ పదవిని రద్దు చేసి ఎన్నికలకు దూరంగా ఉంచాలి. దళితుల ఆత్మగౌరవాన్ని పెంచేది తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమే.
- కాశీ నవీన్ కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

పోరాడి మరణించిన అమరుల ఆత్మకు శాంతి

రామచంద్రపురంలో జరిగిన దళితులు శిరోముండనం ఘటనపై రెండు దశాబ్దాలకు పైబడి ఎందరో దళిత నాయకులు పోరాడారు. వారిలో చాలా మంది మరణించారు. శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులుకు జైలు శిక్షపడడంతో దళిత నాయకుల ఆత్మకు శాంతి కలుగుతుంది. 28 ఏళ్ల తర్వాత తోట త్రిమూర్తులుకు జైలు శిక్షపడడంతో న్యాయస్థానాలపై నమ్మకం మరింతగా పెరిగింది. ఇటు వంటి వ్యక్తులను రాజకీయ పార్టీలు ప్రోత్సహించకూడదు. - **పట్నాల విజయకుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు**

27 ఏళ్ల తర్వాత దళిత యువతకు న్యాయం జరిగింది..

దళిత యువకులకు శిరోముండనం చేసిన వైసీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుతో పాటు మరికొందరికి న్యాయస్థానం 18 నెలల జైలు, రూ.2 లక్షలు జరిమానా విధించడం వైసీపీకి చెంపపెట్టు.. 1996 సంవత్సరం కేసులో దళిత యువకులకు న్యాయం జరిగింది. గడిచిన ఐదేళ్లలో దళిత, ముస్లిం, మైనార్టీలపై దాడులు చేసి హత్యలకు తెగబడ్డ ప్రతి ఒక్కరిని రానున్న టీడీపీ ప్రభుత్వంలో చట్టం ముందు నిలబెడతాం. - **మద్దిపాటి వెంకటరాజు, గోపాలపురం టీడీపీ అభ్యర్థి**



వీరవరంలో రామాలయం
రామునికి కుడివైపున సీతమ్మ

నేడు రాములోరి కల్యాణం

కడియం, ఏప్రిల్ 16 : ప్రతి ఇంటికి రాముడితో సంబంధం ఉంటుంది. ఎందుకంటే హిందువులకు రాముడు అంటే ఒక అటాచ్‌మెంట్.. ఒక నమ్మకం.. అందుకే రాముడి ఆలయంలేని ఊరుండదు..ఏదో ఒక చోట రాముడిని పెట్టుకుని కొలుచుకుంటారు.. ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా కల్యాణం జరుపుకుంటారు..ఆ ఘడియకు వేళయింది.. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామ నవమి వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి.. జిల్లాలోనూ చరిత్ర కలిగిన రామాలయాలు ఉన్నాయి. అటువంటి ఆలయాల్లో కడియం మండలం వీరవరం కోదండ రాముడి ఆలయం ఒకటి. ఈ ఆలయానికి ఒక విశిష్టత ఉంది. ఎన్నో ఏళ్ళ కిందట సీతారాములను నారదముని ప్రతిష్ఠించారని కథ.. ఈ ఆలయంలో మరో ప్రత్యేకత ఏమిటంటే రామయ్యకు సీతమ్మ అమ్మవారు కుడివైపు ఉండడం. వందల ఏళ్ళ కిందట నిర్మించిన ఈ ఆలయంలో ప్రతి ఏటా శ్రీరామ నవమి రోజు వైఖానస ఆగమ సిద్ధాంతం ప్రకారం స్వామి వారి కల్యాణం, వేలాది మందికి అన్నసమారాధన, సాయంత్రం స్వామివారి రథోత్సవం చేస్తారు.ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక నామినేషన్ల పర్వం

- 18 నుంచే నామినేషన్లు ఆరంభం
- అభ్యర్థులకు ముహూర్తం ఖరారు
- 22లోపే కూటమి నామినేషన్లు
- కొందరు వైసీపీ అభ్యర్థులు కూడా
- నియోజకవర్గాల్లో భారీగా ఏర్పాట్లు
- ర్యాలీగా వెళ్లి నామినేషన్లు
- ఎన్నికల వేళ..మరో అడుగు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు మరో అడుగు పడనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది.. ఇప్పటి వరకూ అభ్యర్థుల ఎంపికపై పార్టీలు కుస్తీ పట్టాయి. ఎన్నడూ లేనిది ఈ సారి వడపోత బాగా సాగింది. ఎవరికి టిక్కెట్ వస్తుందోననే టెన్షన్ బాగా నడిచింది. చివరి వరకూ పార్టీలు ఆచితూచి అడుగులు వేశాయి. అభ్యర్థులు అన్ని దశలూ దాటుకుని వచ్చారు. ప్రస్తుతం ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల ఘట్టానికి మరో అడుగు దూరంలో ఉన్నారు. అభ్యర్థుల నామినేషన్లు దాఖలు చేయడానికి సమయం ఆసన్నమైంది. ఈ నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుంది. అదే రోజు ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. కె.మాధవీలత తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో వివిధ పార్టీల తరపున పోటీ చేయనున్న అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. అందులో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ముందుండడం గమనార్హం. వైసీపీ , కాంగ్రెస్ అభ్యర్థులు కొందరు ముహూర్తం ఖరారు చేసుకోగా, వైసీపీ అభ్యర్థులు ఇంకా ముహూర్తం ఖరారు చేసుకోలేదు. కూటమి అభ్యర్థులు మాత్రం ఈ నెల 18,19,22వ తేదీల్లోనే నామినేషన్లు దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తొలి రోజు 18న రాజమహేంద్రవరం సిటీ కూటమి అభ్యర్థి (టీడీపీ) ఆదిరెడ్డి వాసు, గోపాలపురం కూటమి అభ్యర్థి (టీడీపీ) మద్దిపాటి వెంకట్రాజు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఆదిరెడ్డి ఉదయం 11గంటలలోపు నామినేషన్లు దాఖలు చేయడానికి రూట్ సిద్ధం చేసుకున్నారు. మద్దిపాటి వెంకట్రాజు ఘంటావారిగూడెం నుంచి ర్యాలీగా గోపాలపురం వెళ్లి అక్కడ తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. 19న కూటమి లోక్‌సభ అభ్యర్థి(బీజేపీ) దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం రూరల్ కూటమి అభ్యర్థి (టీడీపీ) గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు కూటమి అభ్యర్థి (జనసేన) కందుల దుర్గేష్, కొవ్వూరు కూటమి అభ్యర్థి (టీడీపీ) ముప్పిడి వెంకటేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అనపర్తి నుంచి టీడీపీ అభ్యర్థి పేరు ఖరారు ఎందుకో ఆలస్యం అవుతోంది. కానీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూడా 19న నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇక రాజానగరం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ 22వ తేదీన నామినేషను దాఖలు చేయడానికి ముహూర్తం పెట్టుకున్నారు. కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి గిడుగు రుద్రరాజు 22న ముహూర్తం పెట్టుకున్నారు. అదే రోజు సిటీ కాంగ్రెస్ అభ్యర్థి బోడా వెంకట్ కూడా నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. ఇక వైసీపీకి చెందిన కొవ్వూరు అభ్యర్థి తలారి వెంకట్రావు 18న, రాజానగరం అభ్యర్థి జక్కంపూడి రాజా, గోపాలపురం అభ్యర్థి తానేటి వనిత 19న , రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి చెల్లుబోయినవేణు 22న ముహూర్తం పెట్టుకున్నట్టు సమాచారం.ఇంకా కొంతమంది వైసీపీ అభ్యర్థుల ముహూర్త సమాచారం అందలేదు. కూటమి అభ్యర్థులే ముందుగా నామినేషన్లు దాఖలు చేసి జనంలో మరింతగా వెళ్లడానికి సన్నద్ధమవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉండడంతో పాటు, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఇటీవల నిర్వహించిన ఉమ్మడి సభతో కూటమి క్యాడర్‌లో జోష్ వచ్చింది..

రేపు సీఎం జగన్ రోడ్ షో

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ గురువారం రాజమహేంద్రవరంలో పర్యటిస్తారని మంత్రి వేణు, ఎంపీ భరత్ పేర్కొన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం నుంచి గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు పొట్టిలంక వద్ద జిల్లాలోకి ప్రవేశించి వేమగిరి చేరుకుంటారు. అక్కడ భోజన విరామం తీసుకుని ముఖ్య నాయకులతో సమావేశం అవుతారు. సాయంత్రం సుమారు 4 గంటలకు మోరంపూడి చేరుకుని తాడితోట, చర్చిపేట,ఆజాద్ చౌక్, దేవీచౌక్, మునిసిపల్ కార్యా లయం జంక్షన్, ఆర్యాపురం, మల్లయ్యపేట, కాతేరు వరకూ రాత్రి 7 గంటల వరకూ రాజమహేంద్రవరంలో రూరల్,అర్బన్‌లో రోడ్ షో నిర్వహిస్తారు. అనంతరం కాతేరు నుంచి గామన్ బ్రిడ్జి అప్రోచ్ మీదుగా రోడ్డు మార్గాన దివాన్‌చెరువు నుంచి కాకినాడ జిల్లాకు వెళతారు.



ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు.ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. 21వ తేదీ ఆదివారం నామినేషన్ల స్వీకరణ ఉండదని, 26న స్క్రూట్నీ చేస్తామని, 29వతేదీ సాయంత్రం 3 గంటల వరకూ నామినేషన్లు ఉపసంహరించుకునే గడువు ఉందని తెలిపారు. 3 గంటల తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. మే 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. జూన్ 4వ తేదీన ఓట్లు లెక్కింపు ఉంటుందన్నారు. ఎంసీసీ ఉల్లంఘన సంబంధించిన 46 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘనకు సంబంధించి 41 ఫిర్యాదులు నమోదు కాగా, 39 పరిష్కరించామన్నారు. 1796 మంది వలంటీర్లు రాజీనామా చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ సేవా పోర్టల్ ద్వారా 312 ఫిర్యాదులు వచ్చాయన్నారు. సీజర్ నిర్వహణ వ్యవస్థ ద్వారా 2.12కోట్ల విలువైన వస్తువులు సీజ్‌చేసినట్టు చెప్పారు.ఆదికవి నన్నయ వర్శిటీలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో గతంలో వివిధ కేసుల్లో ఉన్న 6006 మందిని బైండోవర్ చేశామని, 236 లైసెన్స్ ఆయుధాలు ఉండగా అందులో 177 డిపాజిట్ చేశామని, స్పోర్ట్స్, బ్యాంకుల వద్ద ఉన్న 58 వెపన్స్‌కు అనుమతులు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ పి . జగదీష్ తెలిపారు.పోలింగ్ సిబ్బంది ఈనెల 22వ తేదీలోగా నియోజకవర్గాల ఆర్‌వోలకు ఫారం 12 అందించి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం పొందాలన్నారు.

వైసీపీ కార్యక్రమాల్లో కాపులెవరూ పాల్గొనకూడదు..

పశ్చిమగోదావరి జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు

తాళ్ళపూడి, ఏప్రిల్ 16 : కాపులు ఎవ్వరూ వైసీపీకి చెందిన కార్యక్ర మాల్లో పాల్గొనకూడదని పశ్చిమగోదావరి జిల్లా కాపు సంఘ అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు పిలుపునిచ్చారు.తాళ్లపూడి మండలం పెద్దేవంలోని నివాసంలో తోట రామకృష్ణను మం గళవారం పలువురు కాపు సంఘ నాయకులు కలిసి మాట్లాడారు. సమస్య తేలే వరకూ వైసీపీ నామినేషన్లు, తదితర కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు.ఇటీవల కొవ్వూరులో జరిగిన వైసీపీ సమావేశంలో కాపు జేఏసీ సభ్యుడు, వైసీపీ నాయకుడు తోట రామకృష్ణ కాపు నాయకులను ఎందుకు స్టేజ్‌పైకి పిలవడంలేదని ప్రశ్నిస్తే అదే పార్టీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే.ఈ ఘటనపై కాపు సంఘ నాయకులు మండిపడ్డారు. సంఖ్యా పరంగా ఎక్కువగా ఉన్నప్పటికీ రాజకీయంగా కాపు సామాజికవర్గాన్ని అణచివేతకు గురిచేస్తే వదిలిపెట్టేది లేదని హెచ్చరిం చారు. ప్రశ్నిస్తే దాడులు చేయడం తగదన్నారు. కొవ్వూరు మండల వైసీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ మాట్లాడుతూ కులం కంటే పార్టీ ఎక్కువ కాదని అవసరమైతే తోట రామకృష్ణ కోసం తన పదవిని కూడా వదిలేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, కొవ్వూరు ఏఎంసీ మాజీ చైర్మన్ బండి అబ్బులు, కాపు నాయకులు చీర్ల బ్రహ్మ నందం, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, పశ్చిమ జడ్పీ వైస్‌చైర్మన్ తండ్రి పోసిన శ్రీకృష్ణదేవరాయలు, నామా ప్రకాశం, ముత్యాల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చినమిల్లి వెంకట్రాయుడు

వీరేశలింగం స్వగృహాన్ని మరింత అభివృద్ధిలోకి తేవాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16 : సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం స్వగృహాన్ని మరింత అభివృద్ధి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి అన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాజమహేంద్రవరం వంకాయల వారి వీధిలోని అయన స్వగృహాన్ని సందర్శించారు. వీరేశలింగం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరేశలింగం స్వగృహాన్ని ప్రభుత్వ పురావస్తుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో అక్కడున్న అధికారులతో పురందేశ్వరి మాట్లాడారు. వీరేశలింగం గృహాన్ని మరింతగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విషయాలపై వారితో చర్చించి పలు సూచనలు చేశారు. వీరేశలింగం మొట్టమొదట జరిపించిన వితంతు వివాహ వేదిక నమూనా వద్ద పురందేశ్వరి కుటుంబీలతో కలిసి ఫొటోలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



కందుకూరి వీరేశలింగం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి

జేఏసీ చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, ఏప్రిల్ 16: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని జేఏసీ చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ-పోస్టల్ బ్యాలెట్‌లను తాము డ్యూటీలకు హాజరయ్యే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు ఫారం-12 సమర్పించాలన్నారు. దీంతో పాటు డూటీ ఆర్డర్, రెండు పాస్‌పోర్టు ఫొటోలను ఓటరు ఐడీ, ఆధార్ కార్డు జిరాక్సు జతచేసి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందించాలన్నారు. రాష్ట్రంలో అందరికీ ఒకేసారి పోస్టల్ బ్యాలెట్ వేయడానికి ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ఎన్నికల అధికారి తెలియజేశారని చెప్పారు. తమ ఓటు ఎక్కడ ఉందో ఆ రిటర్నింగ్ అధికారికి ఈ దరఖాస్తులు పంపిస్తారన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు



కొవ్వూరు ఆంధ్రా షుగర్స్‌లో కార్మికులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 16: అగ్ని ప్రమాదాలను ముందుగానే గుర్తిస్తే ప్రమాద తీవ్రతను, నష్టాలను తగ్గించుకోవచ్చునని, ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా కాపాడుకోవచ్చునని ఆంధ్రా షుగర్స్ భద్రతాధికారి కేవీవీ సత్యనారాయణమూర్తి అన్నారు. అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా కొవ్వూరు ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు ఆధ్వర్యంలో కార్మికులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలిసిన జాగ్రత్తలు, ప్రమాద నివారణకు వినియోగించే పరికరాల ఉపయోగాలను తెలియజేశారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలిసిన జాగ్రత్తలు, అగ్నిమాపక యంత్రం వినియోగంపై కార్మికులకు అగ్నిమాపక సిబ్బంది శిక్షణ అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పర్సనల్ మేనేజర్ సీహెచ్ఎస్ మహర్షి, ఫైర్ అధికారి ఏపీఎస్ఎస్ఎస్ వేణు, సిబ్బంది పి.అప్పారావు, సీహెచ్‌వీవీ గంగాధర్, ఎం.రవికుమార్, ఎస్‌వై రామకృష్ణ పాల్గొన్నారు.

'అభివృద్ధికి ఆమడ దూరంలో పంచాయతీలు'

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 16: వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మాపు చిత్రసేన్ పేర్కొన్నారు. సోమవారం మోర్త గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి చిత్రసేన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఎటువంటి నిధులు ఇవ్వకపోగా, కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు జమచేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను దారిమళ్లించి ప్రభుత్వ పథకాలకు వాడుకుందని ఆరోపించారు. దీనివల్ల గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేవన్నారు. పంచాయతీలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదని, వీధిలైట్లకు కరెంటు బిల్లులు కట్టే స్థితి పంచాయతీలకు లేదని చిత్రసేన్ విమర్శించారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మర్రి మహాలక్ష్ముడు, నల్లి రమేష్, ఎమ్. చింతరాజు, కప్పల ఇశ్రాయేలు, చిన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథం విశిష్ట సేవలకు సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీకాకుళపు కాశీవిశ్వనాథం

దేవరపల్లి, ఏప్రిల్ 16: దేవరపల్లికి చెందిన పారిశ్రామికవేత్త శ్రీకాకుళపు కాశీవిశ్వనాథం చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను గుర్తించిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ప్రతిష్ఠాత్మక ఉగాది పురస్కారం సోమవారం రాత్రి హైదరాబాదులోని హోటల్ ప్లాజాలో అందజేశారు. ఉగాది పురస్కారాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 40మందికి అందించారని, అందులో తనకు ఈ అవార్డు రావడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని కాశీవిశ్వనాథం అన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధా చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్టు తెలిపారు.

దేవరపల్లిలో అన్నసమారాధన

దేవరపల్లి, ఏప్రిల్ 16: దేవరపల్లిలో కడియాలమ్మ ఆలయం వద్ద మంగళవారం ఉగాది ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మ వారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రక్తదాన, నేత్ర వైద్య శిబిరాలు



హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న దాతలు

గోపాలపురం, ఏప్రిల్ 16: దొండపూడి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఐదో వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంతోపాటు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మానవత సంస్థ తాళ్లపూడి మండల చైర్మన్ సింహాద్రి జనార్దనరావు, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు గోకవరపు బాబు మాట్లాడుతూ నాలుగేళ్లుగా హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో పోతిరెడ్డి నాగరాజు, ముత్యాల రాయుడు, పోలిరెడ్డి పెదబాబు, సురేష్‌బాబు, మురళీ, మద్దాల సనారి, వెంకట్రావు, మద్దాల నాగేశ్వరరావు, షేక్ వల్లి, నున్నా ఆనంత్‌బాబు పాల్గొన్నారు.

కుందులను కలిసిన ముప్పిడి వెంకటేశ్వరరావు



పెరవలి, ఏప్రిల్ 16: టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం తీపర్రులో పార్టీ నాయకుడు కుందుల సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొవ్వూరులో ఆయన గెలుపునకు సహకారం అందిస్తానని కుందుల పేర్కొన్నారు.

గ్లోబల్ అంబాసిడర్‌గా ఆరుమిల్లి చక్రవర్తి



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16: గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన ఆరుమిల్లి చక్రవర్తి ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. రాజమహేంద్రవరానికి చెందిన దివంగత గ్రంథాలయాధికారి ఆరుమిల్లి రంగరావు కుమారుడు చక్రవర్తి. ఆయన ప్రపంచ ప్యాకేజింగ్ అండ్ ఫార్మా రంగంలో దిగ్గజ పారిశ్రామికవేత్తగా ఎదిగారు. తాజాగా చక్రవర్తి వరల్డ్ ప్యాకేజింగ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూపీవో) గ్లోబల్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. డబ్ల్యూపీవో తొలి మహిళా ప్రెసిడెంట్ బ్రెజిల్‌కు చెందిన లూసియానా పెల్లెగ్రినో ఈ విషయాన్ని ప్రకటించారు. అలాగే జాతీయస్థాయిలో ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా ఎంట్రప్రెన్యూర్స్ (ఎఫ్‌వోపీఈ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఏపీ, తెలంగాణ చైర్మన్‌గా చక్రవర్తి నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఖ్యాతిని ప్రపంచానికి చాటిన చక్రవర్తికి ఆయన స్నేహితులు అభినందనలు తెలిపారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

కోరుకొండ, ఏప్రిల్ 16: ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు రామాలయాల్లో ఏర్పాట్లు ఘనంగా చేశారు. సుమారు 96 రామాలయాల వద్ద శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు సన్నద్ధమయ్యాయి. కోరుకొండ హరేరామ సమాజం వద్ద మంగళవారం సీతారామ లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య కోదండ రామాలయం, గాదరాడలోని ఓం శివశక్తి పీఠం, శ్రీరంగపట్నం, బూరుగుపూడి, పశ్చిమగోనగూడెం, కాపవరం గ్రామాల్లో స్వామి వారి పంచామృత అభిషేకం కన్నుల పండువగా జరిగింది.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు గడువు
- అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి
- ఆర్‌వో కార్యాలయాల వద్ద 144 సెక్షన్ అమలు



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు/నిడదవోలు/గోపాలపురం, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నామినేషన్లను ఈ నెల 18వ తేదీ ఉదయం 11గంటల నుంచి స్వీకరించనున్నట్టు కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, నిడదవోలు రిటర్నింగ్ అధికారి ఆర్‌వీ రమణనాయక్, గోపాలపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేఎల్ శివజ్యోతి తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం, నిడదవోలు, గోపాలపురంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గురువారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారన్నారు. అంతకు ముందు నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని (ఏప్రిల్ 21వ ఆదివారం మినహా) తెలిపారు. ఆర్‌వో కార్యాలయాల వద్ద 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేసే వ్యక్తితో పాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. కార్యాలయానికి 100 మీటర్ల వరకు 3 వాహనాలను అనుమతిస్తారన్నారు. నామినేషన్ దాఖలు చేసే వ్యక్తితో పాటు ప్రతిపాదకుడు తప్పనిసరిగా రావాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల నాయకులు, పోటీలో నిలిచే అభ్యర్థులు సహకరించాలన్నారు. సమావేశంలో వి.నాగభూషణం, టి.రామ్‌భూపాల్‌రెడ్డి, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త ఓటు నమోదు ప్రక్రియ ఏప్రిల్ 15తో ముగిసిందని, అర్హులైన ఓటర్లకు మే 13న పోలింగ్ జరిగే రోజున ఓటు హక్కు కల్పిస్తారన్నారు. సమావేశాల్లో వి.నాగభూషణం, టి.రామ్ భూపాల్‌రెడ్డి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ సువర్ణ, సహాయ రిటర్నింగ్ అధికారులు వనజాక్షి, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.కృష్ణ, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

18న నామినేషన్: మద్దిపాటి

గోపాలపురం, ఏప్రిల్ 16: ఈ నెల 18న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్టు మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. గోపాలపురంలో టీడీపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుని మే 13వ తేదీ వరకు అవిశ్రాంతంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దుర్మార్గ, రాక్షస పాలనను ఓటర్లకు వివరించి చైతన్యవంతులను చేయాలన్నారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలను చూసి వైసీపీ గుండెల్లో గుబులుపుట్టాలన్నారు. అలాగే దళిత యువకుల శిరోముండనం కేసులో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఉన్నత న్యాయస్థానం తీర్పుతో పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయస్థానాలపై మరింత గౌరవం ఏర్పడిందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు కొర్లపాటి రాము, హోతా రాజాబాబు, వడ్లమూడి రమేష్, భీముల నాగరాజు, శ్రీనివాసరావు, గణపతి, జ్యేష్ఠ శ్రీను, గెల్లా శ్రీనుబాబు పాల్గొన్నారు.

19న ముప్పిడి నామినేషన్: ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, ఏప్రిల్ 16: ఈ నెల 19న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేయనున్నట్టు టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి తెలిపారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 19న నామినేషన్ వేసేందుకు ఉదయం 9గంటలకు కొవ్వూరు మెరకవీధి వినాయకుని గుడి నుంచి బస్టాండ్, విజయవిహార్ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లనున్నట్టు చెప్పారు. ర్యాలీలో నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలన్నారు. సమావేశంలో అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామన పరమేష్, కొఠారు వెంకట్రావు, బీవీ ముత్యాలరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, కాకర్ల సత్యేంద్ర, మద్దిపాటి వీరరాఘవులు, పొట్రు శ్రీనివాసరావు, కొడవటి వసంతరాయుడు, కూచిపూడి గణపతి, మరపట్ల కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమిదే విజయం

- 18న నామినేషన్ ప్రక్రియకు తరలిరావాలి
- ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి



నల్లజర్ల: చోడవరంలో ప్రచారం చేస్తున్న మద్దిపాటి, ముళ్లపూడి

నల్లజర్ల, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల్లో విజయం కూటమిదేనని జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మంగళవారం రాత్రి పడమర, తూర్పు చోడవరాలు, గుండేపల్లి, తెలికిచర్ల గ్రామాల్లో వారు ప్రచారం ప్రారంభించారు. ముందుగా పడమర చోడవరంలో సర్పంచ్ పెండ్యాల హిమబిందు, చందు ఇంటి వద్ద గ్రామ మహిళలు పెద్ద ఎత్తున వచ్చి మద్దిపాటికి, ముళ్ళపూడికి హారతులిచ్చారు. గోవుకు పూజ చేసి ప్రచారం రథం ఎక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. అనంతరం తెలికిచర్లలో టీడీపీ మండల సర్వసభ్య సమావేశం జరిగింది.

నామినేషన్ దాఖలుకు తరలి రావాలి

ఈ నెల 18న గోపాలపురంలో వేసే నామినేషన్ ప్రక్రియకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, తరలిరావాలన్నారు. ముందుగా ద్వారకా తిరుమల వెంకన్న దర్శనం అనంతరం బైక్‌లు, కార్ల ర్యాలీగా నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం చేరుకుని అక్కడ నామినేషన్ అనంతరం విందు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయరణ, జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, చోడసాని బాపిరాజు,కూచిపూడి ఉదయబాస్కర్, జమ్ముల సతీష్, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, రావూరి వెంకటరమణ, వల్లూరి సత్తిపండు, ఆలపాటి శ్రీరామూర్తి, బీజేపీ నాయకులు శెట్టిపల్లి శివనాగరాజు, చెల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీతోనే రైతు సమస్యలు పరిష్కారం: ముప్పిడి

చాగల్లు, ఏప్రిల్ 16: టీడీపీని గెలిపిస్తేనే రైతుల సమస్యలు తీరతాయని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఊనగట్ల, నందిగంపాడు, చాగల్లు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రోడ్డు పక్కన ధాన్యాన్ని సంచుల్లోకి పడుతున్న రైతులతో ఆయన మాట్లాడారు. ధాన్యం ధర, చెల్లింపులు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలులో ఇబ్బంది లేకపోయినా చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని రైతులు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి, ఆన్‌లైన్ విధానంలో రెండు రోజుల్లో చెల్లింపులు చేసేవారని ముప్పిడి గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, అల్తాఫ్ అహ్మద్, నందిగం చినబాబు, దొంగ రామకృష్ణ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు 1వ వార్డులో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి సుజాత ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలను, బీసీ డిక్లరేషన్ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ, పెనుమాక జయరాజు, బహద్దూర్, కె.నవ్య పాల్గొన్నారు.



చాగల్లు: ఊనగట్లలో రైతులతో మాట్లాడుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న ముప్పిడి

సరికొత్త బోధనా పద్ధతులపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ రామచంద్రరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రియల్ 16: నూతన విద్యావిధానాన్ని అనుసరించి సరికొత్త బోధనా పద్ధతులపై అర్థశాస్త్ర అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమం మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైంది. కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకూ ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తణుకు, తాడేపల్లిగూడెం, విజయవాడ నోడల్ రిసోర్సు కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అర్థశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ వర్చువల్ విధానంలో ఈ తరగతులను ప్రారంభిస్తూ నూతన విద్యా విధానం-2020లో సింగిల్ మేజర్ సబ్జెక్టుల కోసం కళాశాల విద్య తీసుకుంటున్న విధానాలను వివరించారు. అధ్యాపకులకు దిశా నిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, నోడల్ రిసోర్స్ కేంద్రం రాజమహేంద్రవరం సమన్వయకర్త సీహెచ్ సంజీవ్‌కుమార్, నాలెడ్జ్ రిసోర్సు పర్సన్లు డీవీ నాగేశ్వరరావు, కె.యమున, కె.స్వరూప, జి.పావని దేవి తదితరులు పాల్గొన్నారు.

కడియపులంక సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యమే కారణం

కడియం, ఏప్రిల్ 16: మండలంలోని కడియపులంక సచివాలయం-2 గ్రేడ్ 5 కార్యదర్శి ఎండీ పర్విన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు. పర్విన్ ఆ గ్రామంలో 219 పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో)గా ఉన్నారు. అయితే గ్రేడ్-5 కార్యదర్శి బీఎల్‌వో డ్యూటీ చేయడం ఏమిటని మండల స్థాయి అధికారులకు ఎదురుచెప్పడంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ స్వయంగా ఇచ్చిన ఆదేశాలు కూడా ఈమె లెక్కచేయలేదు. దీంతో కలెక్టర్‌కు రిపోర్ట్ చేయడంతో ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నందుకు పర్విన్‌ను సస్పెండ్ చేస్తూ మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు.

వైసీపీ ప్రభుత్వంలో దళితులకు తీరని అన్యాయం

తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ నాయకులు

కడియం, ఏప్రిల్ 16: కోడికత్తి శ్రీను డ్రామాతో ఆరంభమై నేడు గువ్వరాయితో గాయమైన జగన్ ఎన్నికల్లో సానుభూతి పొందాలని చూస్తున్నారని టీడీపీ ఎస్సీసెల్ నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని వేమగిరిలో జరిగిన టీడీపీ ఎస్సీసెల్ సమావేశంలో ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి జల్లి కృపారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కాయల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మాకే భూషణం మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన అన్యాయాన్ని దళితులంతా గమనిస్తున్నారని, ఎన్నికల్లో ఫలితాల్లో చూపుతారన్నారు. కోడికత్తి శ్రీనును జైలులో మగ్గి పోయేలా చేశారని, శ్రీను తలిదండ్రులు అనేక సార్లు బతిమాలినా మనస్సు కరగక పోగా అనేక రోజుల పాటు అతనికి బెయిల్ రాకుండా చేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. దళితులు ఇక మోసపోరన్నారు. కార్యక్రమంలో బొల్లాడి జాన్‌బాబు, చిల్లి ధర్మదాసు, కనికెళ్ళ బుల్లియ్య, చింతపర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేకహోదా

రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి బాలేపల్లి

కడియం, ఏప్రిల్ 16: ప్రస్తుతం రాష్ట్రంలో రాళ్ల రాజకీయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ అన్నారు. మంగళవారం కడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో మంత్రిగా పనిచేసిన జక్కంపూడి రామ్మోహనరావు హయాంలో అభివృద్ధి జరిగిందని, ఆయనతో పాటు పనిచేసిన తనకు నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం ఉందన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని, లోపాలు సరిదిద్దుకుంటూ ముందుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ హయాంలో ఉన్న గ్యాస్ పెట్రోలు నిత్యావసర ధరలు, ప్రస్తుతం ఉన్నధరలు బేరీజు వేసుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేకహోదా, విభజన హామీల అమలుతోపాటు తొమ్మిది గ్యారంటీలను నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి రుద్రరాజు గోపాలకృష్ణ, సీపీఐ రూరల్ మండలాధ్యక్షుడు వి.కొండలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు తాడాల కొండరాజు, చక్రవర్తి, బందారు వెంకన్న, ఉలిశెట్టి సత్తిబాబు, పీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలి

- టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గేష్, టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి



కండిపాడులో మహిళలతో మాట్లాడుతున్న దుర్గేష్, శేషారావు

పెరవలి, ఏప్రిల్ 16: వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన నుంచి విముక్తి పొందాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్, టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. మండలంలోని కడింపాడు, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, పి.వేమవరం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి భోగవల్లి ప్రసాద్, నాయకులు భూపతిరాజు రవివర్మ, అతికాల రామకృష్ణమ్మ(శ్రీను), కోటిపల్లి మురళీకృష్ణ, పిప్పర రవి పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూత్ కన్వీనర్లు కీలకం

నిడదవోలు, ఏప్రిల్ 16: ఎన్నికల్లో బూత్ కన్వీనర్లు కీలకమని, ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులో నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీల బూత్ కన్వీనర్లు, వారియర్స్ సమావేశం నిర్వహించారు. మంగళవారం ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కందుల దుర్గేష్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో భోగవల్లి ప్రసాద్, కాకర్ల నాని, పోలిరెడ్డి వెంకటరత్నం, బుగ్గే శివరామకృష్ణ శాస్త్రి, పంచదార దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

తోట త్రిమూర్తులు ఎమ్మెల్యే టిక్కెట్టును రద్దుచేయాలి

కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 16: దళితులను అవమానించిన వారికి పదవులు ఇవ్వడం జగన్మోహనరెడ్డి పైశాచికానందమని టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. దళిత యువకులకు శిరో ముండనం కేసులో విశాఖ ఎస్సీ ఎస్టీ సిటీ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. తోట త్రిమూర్తులును పార్టీ నుంచి బర్తరఫ్ చేసి ఎమ్మెల్యే టిక్కెట్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ మనస్సులో స్థానం సంపాదించాలంటే వారు కనీసం ఒక దోపిడి, ఒక అత్యాచారం, ఒక హత్యా, ఒక దౌర్జన్యం, చివరకు కనీసం బూతులు తిట్టడంలో దిట్ట అయ్యి ఉండాలన్నారు. దళితులంటే మొదటినుంచి జగన్‌రెడ్డికి చిన్నచూపేనని, అతడు దళిత ద్రోహి అని అన్నారు. అందుకే డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన అనంతబాబును ప్రక్కన పెట్టుకున్నాడన్నారు. దళిత యువకులను శిరో ముండనం చేసిన తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చాడు. శిరో ముండనం కేసులో నిందితుడైన త్రిమూర్తులకు మండపేట వైసీపీ ఎమ్మెల్యే సీటు ఎలా ఇస్తారని ముప్పిడి ప్రశ్నించారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రణాళిక పూర్తి

సిబ్బందితో సమీక్షలో ఆర్‌వో దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 16: రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రణాళిక పూర్తి చేసినట్టు ఆర్‌వో దినేష్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం సిటీ ఎన్నికల సామగ్రి పంపిణి కేంద్రమైన ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్నికల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీకి 20 బృందాలను నియమించామని, ఒక్కొక్క బృందంలో ఆరుగురు సిబ్బంది ఉంటారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మొత్తం సామగ్రి ఇక్కడే ఉంటుందన్నారు. ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పోలింగ్ స్టేషన్లు వచ్చేనెల 12న ఉదయం కేటాయిస్తామన్నారు. సామగ్రిని, పోలింగ్ సిబ్బందిని వారికి కేటాయించిన పోలింగు స్టేషన్లకు బస్సుల ద్వారా చేరుస్తామన్నారు. సెక్టారు అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, ఎన్నికల రోజు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి రిపోర్టు తీసుకోవాలని ఈ కార్యక్రమాన్ని పూర్తి నిబద్ధతతో అత్యంత జాగరుకతతో నిర్వహించాలన్నారు. పంపిణీ కేంద్రంలో చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, డీఎస్పీ కె.విజయపాల్, తహశీల్దార్ కె.ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్లు, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు 'కందుకూరి'

వీరేశలింగం పంతులు జయంతిలో టీకే విశ్వేశ్వరరెడ్డి



కందుకూరి దంపతుల సమాధులకు పూలమాలలతో నివాళులర్పిస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16: స్త్రీ విద్య కోసం ఉద్యమించి ప్రచారం చేయడమే కాకుండా బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిన నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు అని రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ నాయకులు, రాజమహేంద్రి మహిళా విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలోని కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల వద్ద ఆనంద గార్డెన్స్ స్మృతి వనంలోని కందుకూరి దంపతుల సమాధులకు టీకే విశ్వేశ్వరరెడ్డి తదితరులు పూలమాలలు దండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ సభ్యులు ఎల్‌వీ ప్రసాద్, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ సాహిత్యం, సంస్కరణల ఏకసూత్రత ఘటించి కత్తి దూసిన మహాపురుషుడు వీరేశలింగం అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, సూపరింటెండెంట్ మూర్తి, వై.స్వర్ణశ్రీ, డీవీ రమణమూర్తి, జి.వెంకటరమణ, ఎం.లలిత రమ్య, కె.రూపాదేవి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల వద్ద ఆనంద్ గార్డెన్స్ కందుకూరి స్మృతి వనంలోని కందుకూరి వీరేలింగం పంతులు సమాధులకు రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ సభ్యులు టీకెవిశ్వేశ్వరరెడ్డి, ఎల్‌వీ ప్రసాద్ పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ వీరేశలింగం పంతులు నవయుగ వైతాళికుడని, స్త్రీవిద్యకు అహర్నిశలు శ్రమించి, పాఠశాలలు స్థాపించి సహ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడంలో ఆద్యుడయ్యాడని అన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	లవ్‌గురు
వై.స్క్రీన్2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	డీజే టిల్లు-2
రాధాకృష్ణ	ఫ్యామిలీ స్టార్
శ్రీగణపతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి